
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం
శనివారం ఉష్ణోగ్రత ఖమ్మం: గరిష్ఠం 31 । కనిష్ఠం 21 | భద్రాద్రి: గరిష్ఠం 30 । కనిష్ఠం 20 ◆ ఆదివారం, 14 జనవరి 2024

భోగితో బోణీ

- పల్లెకు పండుగ కళ
- నేడు భోగి ఉత్సవాలు
- బంధుగణంతో గ్రామాల్లో సందడి
- సంక్రాంతికి సర్వం సిద్ధం

ఖమ్మం, సాంస్కృతికం/కొత్తగూడెం సాంస్కృతికం, జనవరి 13: సూర్యుడు ధనస్సు నుంచి మకర రాశిలోకి ప్రవేశిస్తున్న వేళ తెలుగు లోగిళ్లు సంక్రాంతి సంబురాలకు సిద్ధమవుతున్నాయి. రైతులు తమ తొలి పంటను ఇష్ట దైవానికి సమర్పించి మొక్కులు తీర్చుకునే ఈ ఉత్సవాల్లో తొలిరోజు భోగి ఉత్సవాలకు పల్లెలు సిద్ధమయ్యాయి. భోగ భాగ్యాలు కలిగించే భోగి ఉత్సవాలు ఆదివారం తెల్లవారుజామునే ప్రారంభమవుతాయి. తెల్లవారుజామున నిద్రలేస్తూనే భోగిమంటలు వేసి అనంతరం తమ కష్టాలు తొలగిపోవాలని తమ ఇష్టదైవాన్ని తలుకొని భోగిస్నానాలు ఆచరించడం ఈ పండుగ ప్రత్యేకత. ఈ రోజున చిన్న పిల్లలకు తలంటూ స్నానాలు చేయించి నూతన దుస్తులు ధరింపచేసి భోగిపళ్లతో దిష్టి తీసి ఆశీర్వదిస్తారు. సంస్కృతి, సంప్రదాయలను ప్రతిబింబించేలా ఇళ్లముందు వాకిళ్లలో పిండితో ముగ్గులు వేసి ఆ ముగ్గుల్లో గొబ్బెమ్మలు, రేగుపళ్లు ఉంచి సంక్రాంతికి స్వాగతం పలుకుతారు.

బంధుగణంతో పల్లెల్లో సందడి..

నిజమైన సంక్రాంతి కళ కనిపించేది పల్లెల్లోనే తెలుగువారి పెద్దపండుగైన సంక్రాతికి ఇంటి ఆడబిడ్డలు పుట్టింటికి, కొత్త అల్లుల్లు అంతారింటికి వస్తారు. అంతేకాకుండా విద్యా, ఉద్యోగం అంటూ ఇతర ప్రాంతాల్లో ఉంటున్నవారు సైతం సంకాత్రికి సొంత ఊర్లకు చేరుకున్నారు. దాంతో పల్లెలు కళకళలాడుతున్నాయి. పండుగ శోభను ద్విగ్విణీకృతం చేస్తూ గ్రామాల్లో హరిదాసులు, గంగిరెద్దుల విన్యాసాలు, కోళ్ల పందాలు మొదలయ్యాయి. గాలి పటాల ఎగురవేతలతో చిన్నారులు కేరింతలు కొడుతున్నారు. ఇందుకోసం రకరకాల డిజైన్లలో పతంతుగలను, మాంజాలను విక్రయిస్తున్నారు. పల్లెల్లో సంక్రాంతి పిండివంటలు ఘుమఘుమలాడుతున్నాయి. పండుగ సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



కోడిపందాలకు వేళాయే!

- ఆంధ్రావైపు తెలంగాణ పందెపురాయుళ్ల చూపు
- ఏపీ సరిహద్దు గ్రామాల్లో భారీగా బిర్రుల ఏర్పాటు
- పండుగ మూడు రోజులూ సందడే సందడి

అశ్వారావుపేట, జనవరి 13: సంక్రాంతి పండుగలో అందరికంటే ఎక్కువగా సందడి చేసేది కోడి పందేలే. తెలుగోడి పౌరషానికి సూచికగా కోడి పుంజులను పోలుస్తుంటారు. తెలంగాణలో కోడిపందాలపై నిషేధం ఉన్నా ఏపీ సరిహద్దులో ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కోడి పందాలు వేసేందుకు ఔత్సాహికులు ఎక్కువగా మక్కువ చూపుతుంటారు. ఒక్కొక్కరు లక్షల్లో పందాలు కాస్తుంటారు. లక్షలు వెచ్చించి కోడి పుంజులను పందాలకు సిద్ధం చేస్తారు. అయితే ఆదివారం భోగి పండుగ సందర్భంగా ఏపీలో జరిగే కోడి పందాల్లో పాల్గొనేందుకు, వీక్షించేందుకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా ఔత్సాహికులు ఏపీ బాట పట్టారు. జిల్లాలోని అశ్వారావుపేట, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, మధిర, ఖమ్మం పరిసరాలలోని పందెపురాయుళ్లు ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా కావయ్యపాలెం, శ్రీనివాసపురం, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, భీమవరం, తాడేపల్లిగూడెం, ఏలూరు, కుకునూరు, వేలేరుపాడు, చీరవెల్లితో పాటు కృష్ణాజిల్లా, తూర్పుగోదావరి జిల్లా, తూర్పు గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో కోడి పందాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. శనివారం సాయంత్రం నుంచే చాలామంది ఏపీలోని బిర్రుల వద్దకు చేరుకుంటున్నారు. ఆయా బిర్రుల వద్ద మద్యం విక్రయాలతో పాటు పలు రకాల జూదాలు నిర్వహిస్తుంచేందుకు ఏర్పాట్లు చేస్తుండటంతో పందాలు వేసేవారే కాకుండా, వాటిని వీక్షించేవారు సైతం భారీ తరలి వెళుతున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో ఏపీలో జరిగే కోడి పందాల్లో పాల్గొనేందుకు కొందరు రైతులు కూడా వ్యవసాయ పనులకు బ్రేక్ ఇచ్చి ఏపీ బాట పడుతున్నారు.


ఆంధ్రా సరిహద్దు కామయ్యపాలెంలో కోడిపందాలకు సిద్ధమవుతున్న బిర్రులు

పర్యటనలు.. పలకరింపులు



- నూతన పంథాలో మంత్రి తుమ్మల శైలి
- ఒకపక్క అధికారిక కార్యక్రమాల్లో బిజీబిజీ
- మరోపక్క ఎన్నికల్లో సహకరించిన వారి ఇళ్లకు వెళ్లి కృతజ్ఞతలు
- నూతన ఒరవడితో సాగుతున్న వ్యవసాయశాఖ మంత్రి

ఖమ్మం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సాధారణంగా రాజకీయ నాయకులు ఎన్నికలవేళ ఆయా సామాజిక సంఘాల నేతలు, వివిధ వృత్తుల్లో ఉన్న ప్రముఖుల ఇళ్లకు వెళ్లడం మద్దతు కోరడం వంటివి చేస్తుంటారు. ఎన్నికల తరువాత గెలిచినవారు బిజీ అయిపోతారు. కానీ ఇందుకు భిన్నంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎన్నికల అనతరం తన విజయానికి సహకరించినవారికి కృతజ్ఞతలు తెలిపేందుకు నేరుగా వారి ఇళ్లకు, కార్యాలయాలకు వెళ్లి సమావేశాలు నిర్వహిస్తున్నారు.జిల్లాలో మంత్రిగా బీజీగా కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఖమ్మం నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల తరుణంలో తనకు సహకరించిన వారి ఇళ్లకు వెళ్లి నేరుగా వారి కుటుంబసభ్యులతో తన విజయాన్ని పంచుకుంటున్నారు. మంత్రిగా అధికారిక కార్యక్రమాల్లో బిజీగా ఉంటున్నా సమయం చూసుకొని తన విజయానికి సహకరించినవారికి స్వయంగా కృతజ్ఞతలు తెలిపేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. గతంలో మంత్రిగా తుమ్మల ఎన్నికల ప్రచార బాధ్యతలను పోల్ మేనేజ్‌మెంట్‌ను తన కేడర్‌కు అప్పగించే పరిస్థితి ఉండేది. 2018 పాలేరు ఎన్నికల్లో ఓటమి తరువాత తాజా ఎన్నికల్లో ఖమ్మంనుంచి బరిలోకి దిగితన 40ఏళ్ల రాజకీయజీవితంలో ఎన్నడూలేని రీతిలో ఎన్నికల ప్రచారం సాగించారు. తన వయస్సును సైతం లెక్కచేయకుండా గెలుపేలక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ప్రచారం సాగించారు. అందులో భాగంగా పార్టీలకు అతీతంగా ఆయా రాజకీయ పార్టీల నాయకులను, పలు కులసంఘాలు, వివిధ వృత్తుల్లో వ్యక్తిగతంగా రాణించిన ప్రముఖులను, విద్యావంతులను వివిధ రంగాల్లో రాణించిన ప్రముఖుల కుటుంబాలను, తెలంగాణ ఉద్యమకారులను, విద్యాప్రముఖుల ఇళ్లకు వెళ్లి తుమ్మల వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈసారి తుమ్మల చేసిన భిన్నమైన ప్రచారం అందరిని ఆకట్టుకుంది.

అధికార కార్యక్రమాలతో బిజీ..

మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తుమ్మల నాగేశ్వరరావు అధికార కార్యక్రమాల్లో జోరు పెంచారు. సీతారామ ప్రాజెక్టుపై సమీక్షలు సాగించారు. కలెక్టర్లు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి నత్తనడకన సాగుతున్న సీతారామ ప్రాజెక్టు పనులను మళ్లీ పరుగులు పెట్టిస్తున్నారు. హైదరాబాదులో ఇరిగేసన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటితో కలిసి సమావేశం నిర్వహించారు. అలాగే జిల్లాలో రహదారుల పరిస్థితిపైకూడా తుమ్మల చొరవ తీసుకుని సమీక్షా సమావేశం నిర్వహించారు. మరోపక్క అక్రమమైనింగ్, ఇసుకతవ్వకాలు, భూఆక్రమణలుపై కొరడా ఝుళిపించి జిల్లా రాజకీయాల్లో తుమ్మల తనమార్క్‌ను చూపిస్తున్నారు. అధికారిక కార్యక్రమాల్లో బిజీగా ఉంటున్నా ఖమ్మం నియోజకవర్గంలో తన విజయానికి సహకరించిన మేధావులు, ఆయా రంగాల ప్రముఖులు, సంఘాలు, రాజకీయపార్టీల నాయకుల ఇళ్లకు ఆకస్మికంగా వెళ్లి తన విజయానందాన్ని వారి కుటుంసభ్యులతో పంచుకుంటున్నారు. ఎన్నికలముందు ఓటు అడిగేందుకు వచ్చిన తుమ్మల గెలిచిన తర్వాత కూడా తమ ఇళ్లకు రావడంతో వారంతా సంతోషిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఓట్లడిగేందుకే కాకుండా గెలిచిన తరువాత తన విజయాన్ని పంచుకునేందుకు తుమ్మల స్వయంగా వెళుతుండడాన్ని ఆయా వ్యక్తులు, నాయకులు ప్రశంసిస్తున్నారు. శాలువాలతో తుమ్మలను సత్కరిస్తున్నారు. ప్రస్తుతం తుమ్మల అనుసరిస్తున్న ఈ కొత్త విధానం జిల్లాలో చర్చనీయాంశమైంది.

సర్దుబాట్లపై ఇంటెలిజెన్స్ నిఘా



- డిప్యూటేషన్లు, ఆన్‌డ్యూటీల వివరాల సేకరణ
- ఉపాధ్యాయవర్గాల్లో తీవ్ర చర్చ

ఖమ్మం ఖానాపురం హవేలీ, జనవరి 13: జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల తీరుపై ఇంటెలిజెన్స్ వర్గాలు దృష్టి సారించాయి. కేటాయించిన పాఠశాలల్లో కాకుండా డిప్యుటేషన్లు, ఆన్‌డ్యూటీల పేరుతో అనుకూల ప్రాంతాలకు వెళ్లిన వారు, సర్దుబాటుపై వెళ్తున్న వారు, ప్రజాప్రతినిధుల సిఫార్సులతో ఇతర పాఠశాలలకు వెళ్లిన వారి వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇటీవల వెలుగులోకి వచ్చిన అక్రమ డిప్యుటేషన్ల వ్యవహారం రాష్ట్ర విద్యా శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో ఇదే తీరులో జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఉన్నారనే దానిపై ఇంటెలిజెన్స్ పోలీసులు సమాచారాన్ని సేకరిస్తున్నట్లు ఉపాధ్యాయవర్గాల్లో చర్చ జరుగుతోంది.

బోధనకు బదులు.. మరోచోట సేవలు

జిల్లా విద్యాశాఖలో ఆన్‌డ్యూటీ పేరుతో పాఠశాల ఉపాధ్యాయులను వివిధ పనులకు కేటాయించుకుంటున్నారు. కొంతకాలంగా అక్కడే ఉంటున్నారు. సర్దుబాటు ద్వారా పలువురిని పాఠశాలల నుంచి వేరే కార్యాలయాలకు కేటాయించినట్లు సమాచారం. ఇక ఎంఈవో కార్యాలయాల్లో బిల్లుల కోసం అనధికారికంగా ఏర్పాటు చేసుకున్నారని తెలుస్తోంది. పేరుకు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నట్లుగా ఉంటున్నా వారు నెలలో చాలా రోజులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. పదోతరగతి నామినల్ రూల్స్, పరీక్షల నిర్వహణ, స్పాట్ వంటి వాటికి కొందరిని జిల్లా విద్యాశాఖ రోజుల తరబడి ఉపయోగించుకుంటోంది. కొందరికే ఈ విధులు అప్పగిస్తున్నారనే అపవాదు ఉంది.

చెక్ పెట్టాలనే ఆలోచనతో..

క్రీడా కార్యక్రమాలకు తరచూ కొందరు వ్యాయామ ఉపాధ్యాయులకే ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పిస్తున్నారని ఇతర పీఈటీలు జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు ప్రాంతీయ క్రీడా పాఠశాలలో కూడా డిప్యుటేషన్‌లపై ఏళ్లకు ఏళ్లు ఇక్కడే పనిచేస్తున్న వారు ఉన్నారు. ప్రజాప్రతినిధుల సిఫార్సులతో పలువురు ఉపాధ్యాయులు వారికి కేటాయించిన విధులను వదిలి సర్దుబాటు పేరుతో అనుకూల పాఠశాలలకు వచ్చారు. ఇలాంటి వ్యవహారాలకు చెక్ పెట్టాలనే ఆలోచనతో ప్రభుత్వం ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా సమాచారాన్ని సేకరిస్తోంది.

ఆయిల్‌ఫెడ్‌లో అక్రమం

- నాసిరకం మొక్కల సరఫరాతో లక్షల్లో నష్టపోయిన రైతులు
- పలు దశల్లో తనిఖీ బృందాలున్నా నాణ్యతలేని మొక్కల సరఫరా
- రూ.50 లక్షల మేర నష్టపోయామని ఓ రైతు ఫిర్యాదు

సత్తుపల్లి, జనవరి 13: ఆయిల్‌ఫెడ్‌లో అక్రమం వెలుగుచూసింది. ఆయిల్‌ఫెడ్‌లో రవాణా నుంచి విత్తనాల కొనుగోళ్లు, నూనె ఉత్పత్తి అమ్మకాల వరకు అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో శనివారం సత్తుపల్లి మండలం నారాయణపురంలో వెలుగు చూసిన ఘటన వాటిని రుజువుచేసిందనే వ్యాఖలు వినిపిస్తున్నాయి. సత్తుపల్లి మండలం, నారాయణపురం గ్రామంలో పుచ్చకాయల సోమిరెడ్డి, పుచ్చకాయల చెల్లెమ్మ, రమేష్‌రెడ్డిలకు చెందిన 12ఎకరాలలో 2018లో ఆయిల్‌ఫెడ్ ద్వారా తీసుకొని వేసిన పామాయిల్ మొక్కలు ఆరు సంవత్సరాలైనా కాపులేకుండా పోయింది. ఆయిల్‌ఫెడ్ అధికారులు కాసులకు కక్కుర్తితో పామాయిల్ విత్తనాల కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడటం వల్లనే ఆరు సంవత్సరాల పాటు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి సాగు చేసిన తోటలో గెలలు వేయలేదని రైతులు సోమిరెడ్డి, రమేష్‌రెడ్డిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయిల్‌ఫెడ్ తమకు నాసిరకం ఆయిల్ పాం మొక్కలు ఇవ్వటం వల్ల రూ.50లక్షల మేర నష్టపోయామని పుచ్చకాయల సోమిరెడ్డి ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ చేసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయిల్‌పాం రైతులు సోమిరెడ్డి, రమేష్‌రెడ్డి, చెల్లెమ్మలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయిల్ ఫెడ్, ఉద్యాన వన శాఖల ఉన్నతాధికారులకు శనివారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు పంపారు.

విత్తన కొనుగోళ్లలో అక్రమాలు

పామాయిల్ మొక్కలకోసం ఆయిల్‌ఫెడ్ మలేషియా, ఇండోనేషియ, కోస్టారికాల నుంచి విత్తనాలను కొనుగోలు చేస్తారు. అలా కొనుగోలు చేసిన మొలకలను విమానాలలో ఫ్రీజర్‌లలో ఉంచి తీసుకొస్తారు. ఈ విత్తనాలను ఇక్కడి శాస్త్రవేత్తలు పలు దశల్లో పరిశీలించి, పాలీహౌస్‌లలో మొలకలను సంచులలో నాటుతారు. మొలకలు వేసిన నాటిన నాటి నుంచి 11 నెలల పాటు మొక్కలు పెరిగే సమయంలో వివిధ దశలలో క్వారంటైన్ అధికారులు పలు పరీక్షలు చేస్తారు. ఎన్నో దశల్లో పరీక్షల అనంతరం ఆయిల్ పాం మొక్కలు నర్సరీ నుంచి రైతులకు సరఫరా చేస్తారు. ఇంత పకడ్బందీగా ఆయిల్ పాం మొక్కలు నర్సరీలనుంచి రైతులకు సరఫరా అయ్యే వ్యవస్థ ఉన్నా ఏళ్ల తరబడి రైతులు సాగు చేసిన తరువాత కాపు రాకపోవటంతో సమయం వృథా అవటంతో పాటు ఆర్థికంగా రైతులు భారీగా నష్టపోయే పరిస్థితి నెలకొంది.

12 ఎకరాల్లో 500 చెట్లకు కాపురాలేదు

సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన పుచ్చకాయల సోమిరెడ్డి 5.15ఎకరాలు, పుచ్చకాయల చెల్లెమ్మ 5-07 ఎకరాలు, పుచ్చకాయల రమేష్‌రెడ్డి 2-17 ఎకరాల్లో 2018లో 700 పామాయిల్ మొక్కలను అశ్వారావుపేట పామాయిల్ నర్సరీ నుంచి తెచ్చి నాటారు. ఆరేళ్లు గడిచినా 500మొక్కలకు ఇంతవరకు గెలలు రాలేదు. సాధారణంగా మూడో సంవత్సరంలోకి రాగానే గెలలు రావడం ప్రారంభం అవుతాయి. కాని ఆరేళ్లయినా కాపు రాకపోవటంతో సదరు రైతులు అధికారులను సంప్రదించారు. అయితే అక్కడక్కడ మొక్కలు మారిస్తే సరిపోతుందని రైతులను నమ్మించిన అధికారులు 100 మొక్కలు తొలగించి వాటి స్థానంలో కొత్త మొక్కలు ఇచ్చారు. అయినా ఫలితం లేకపోవటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు జరిగిన నష్టంపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని వాపోయారు.


బాధిత రైతు పుచ్చకాయల సోమిరెడ్డి

ఆయిల్‌ఫెడ్‌లో కలకలం

నష్టపోయిన రైతులు నేరుగా సీఎంతో పాటు, వ్యవసాయ శాఖ, రెవెన్యూ మంత్రులకు ఫిర్యాదు చేయటంతో అధికారుల్లో కలకలం మొదలైంది. ప్రభుత్వరంగ సంస్థ అయిన ఆయిల్‌ఫెడ్‌పై నమ్మకంతో రైతులు ఆయిల్‌పాం సాగు చేస్తుంటే ఏళ్లు సాగుచేసిన తరువాత కాపు రాకపోవటంతో ఘోరంగా నష్టపోతున్నారు. 2018లో ఇదే నర్సరీ నుంచి మొక్కలు తీసుకున్న రైతులకు కూడా ఇదే పరిస్థితి ఎదురైందా అనే విషయం చర్చనీయాంశంగా మారింది.


నారాయణపురంలో ఏపుగా పెరిగినా కాపురాని పామాయిల్ తోట

జన్యుపరమైన లోపంవల్లే

ఈ విషయంపై ఖమ్మం ఉద్యాన శాఖ ఏడీ భారతిని సంప్రదించగా రైతుల ఫిర్యాదు మేరకు తోటలను సందర్శించామని తెలిపారు. చాలా చెట్లు గెలలు కాపు రాలేదని ఆమె నిర్ధారించారు. జన్యుపరమైన లోపంవల్ల కాపు రాకపోయి ఉండవచ్చన్నారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ నిర్వహిస్తామని తెలిపారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి

- ఖమ్మం జిల్లాలో 4,91,012.. భద్రాద్రిలో 3,33,225 అర్జీలు
- 17నుంచి క్షేత్రస్థాయిలో విచారణ?

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 13: ప్రజాపాలన గ్రామసభల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రజలు అందిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయ్యింది. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 4లక్షల 71వేల 425 కుటుంబాలు ఉండగా 589 పంచాయతీలు, నాలుగు మునిసిపాలిటీల్లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,88,316 దరఖాస్తులు అందాయి. ఈ దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఈ నెల 6న మొదలు పెట్టారు. జనవరి 13నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశాలు జారీ చేయడంతో గడువులోనే దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేశారు. ఆరు గ్యారెంటీ పథకాలతో పాటు రేషన్ కార్డులకు, ఇతర సమస్యలపై కూడా అధికారులు దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్ చేశారు. మొత్తంగా 100.55శాతం దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. జిల్లాలోని 20 మండలాల్లో ఎంపీడీవో కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా శిక్షణ పొందిన 1,300 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలిరోజున 35వేల దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. వాస్తవానికి ప్రభుత్వం ఈనెల 17వరకు ఆన్‌లైన్ ప్రక్రియకు గడువు ఇచ్చినా కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశాలతో ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో శనివారం నాటికే ప్రక్రియ పూర్తి చేశారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోలనూ ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయ్యింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 22మండలాల్లోని 479 పంచాయతీలు, నాలుగు మునిసిపాలిటీలనుంచి మొత్తం 3,33,225 దరఖాస్తులు స్వీకరించగా కలెక్టర్ ప్రియాంక అలా చొరవతో ప్రభుత్వం విధించిన గుడువుకంటే ముందే శనివారం నాటికి మొత్తం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొదుపరిచారు.


ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది


ఖమ్మం రూరల్ మండలం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న దృశ్యం

ఇంకా ఖరారు కానీ మార్గదర్శకాలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల పథకాల అమలుకు అధికార యంత్రాంగానికి ఇంకా ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాలేదు. ప్రజాపాలన కార్యక్రమంలో నిత్యం కనీసం 50వేలకు పైగా దరఖాస్తులు అందాయి. అయితే వీటి అమలుకు ఇంకా మార్గదర్శకాలు విడుదల చేయలేదు. ఫిబ్రవరి నుంచి మహిళలకు రూ.2,500 ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఎంతోమంది మహిళలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అధికారులు మాత్రం ప్రతి ఇంటికీ ఏదో ఒక పథకం చేరుతుందని చెబుతున్నారు. అయితే లబ్ధిదారుల ఎంపిక ఎప్పటి వరకు చేస్తారనే విషయమై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అయితే 17వ తేదీనుంచి ఆన్‌లైన్ చేసిన దరఖాస్తుల ఆధారంగా అధికారులు గ్రామస్థాయికి వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ చేపడతారని తెలుస్తోంది. ఈ సందర్భంగా నిర్వహిచే గ్రామసభల్లోనే ఎవరు ఏ పథకానికి అర్హులవుతారనే విషయం స్పష్టం చేస్తారని తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి మాత్రం స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల కావాల్సి ఉంది.

అన్నపురెడ్డిపల్లికి వైద్యం బహుదూరం

- ప్రభుత్వాసుపత్రి లేక ప్రజల ఇబ్బందులు
- అత్యవసరమైతే సుదూరప్రాంతాలకు వెళ్లాల్సిందే

అన్నపురెడ్డిపల్లి, జనవరి 12: మండల కేంద్రమైన అన్నపురెడ్డిపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదైనా ప్రమాదం సంభవిస్తే 30కిలోమీటర్ల దూరంలోని సత్తుపల్లి, పెనుబల్లి, కొత్తగూడెం లాంటి పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అన్నపురెడ్డిపల్లి 28గ్రామాలకు మండల కేంద్రంగా ఉంది. ఆ గ్రామాల్లో సుమారు 35వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. అన్నపురెడ్డిపల్లిలో బాలుర, బాలికల గురుకు పాఠశాలలు కస్తూర్బా పాఠశాల, గిరిజన బాలుర వసతి గృహం ఉన్నాయి. వీటిలో 1,250 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతంలో గురుకుల పాఠశాలలో 200మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనప్పుడు విద్యార్థుల పరిస్థితి విషమించడంతో 80మంది విద్యార్థులను కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గతంలో మండలంలో విషజ్వరాలు ప్రభలిన సమయంలోనూ తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రస్తుతం మండలంలోని మొత్తం గురుకులాల్లో సుమారు 2,500 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి అత్యవసర సమయంలో వైద్యం చేయాలంటే దూరప్రాంతాలకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితి వస్తే సత్తుపల్లి, కొత్తగూడెం, ఖమ్మం లాంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. 14 కిలోమీటర్ల దూరంలోని ఎర్రగుంట ప్రభుత్వాసుపత్రిలో 6పడకలు ఉన్నాయి. సిబ్బంది స్థానికంగా ఉండకపోవడంతో ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అన్నపురెడ్డిపల్లిలో ప్రభుత్వాసుపత్రి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక్కడ ఆసుపత్రి కోసం చేసిన ప్రతిపాదనలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఇప్పటికైనా సంబందిత శాఖాదికారులు చర్యలు తీసుకోని అన్నపురెడ్డిపల్లిలో ప్రభుత్వాసుపత్రి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రామాలయంలో నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

భద్రాద్రిలో భక్తుల సందడి

భద్రాచలం, జనవరి 13: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వరుస సెలవుదినాలతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు భద్రాద్రి రామయ్యను దర్శించుకునేందుకు తరలివచ్చారు. భారీగా భక్తులు తరలిరావడంతో రామాలయం, ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసాయి. శనివారం రామయ్య దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్ లో వేచి ఉన్నారు. అనంతరం తమ ఆరాధ్య దైవమైన రామయ్యను దర్శించుకున్నారు. శనివారం స్వామివారికి నిర్వహించిన నిత్యకల్యాణంలో 105జంటలు పాల్గొన్నారు. సీతారామచంద్రస్వామి వారిని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో పాటు వారి కుటుంబసభ్యులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈవో భవాని రామకృష్ణరావు, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, ముఖ్య అర్చకులు శ్రీ పెదంబదూర్ మదన్‌మోహనచార్యులు పాల్గొన్నారు. కాగా దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత నిత్య అన్నదాన పథకానికి హైదారాబాద్ అమీన్‌పూర్‌కు చెందిన శ్రీరంగం కార్తీక్, శ్రీరామ్ లక్ష్మీ లావణ్యలు రూ.1,00,116లు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అన్నదానం బాండ్‌ను దాతలకు పర్యవేక్షకులు లింగాల సాయిబాబా అందజేశారు. హైదారాబాద్‌లోని మణికొండకు చెందిన తాటికొండ గౌరిహరిణి లక్ష రుపాయలు విరాళంగా అందజేశారు.

జమలాపురం ఆలయంలో భక్తుల రద్దీ

ఎర్రుపాలెం, జనవరి 13: జమలాపురం దివ్యక్షేత్రంలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. తెల్లవారుజామునే ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల విజయదేవశర్మ ఆధ్వర్యంలో శ్రీవారికి సుప్రభాతసేవ నిర్వహించి, పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో సర్వాంగభిషేకము నిర్వహించారు. ప్రతిష్టాస్వామికి నూతన పట్టు వస్త్రాలు ధరింపజేసి భక్తులకు దర్శనం కలిగించారు. కార్యక్రమాల్లో వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి, సోమయ్య, కృష్ణప్రసాద్, సాయి, వంశీ, బాణావత్, విజయ్, పీట మారుతిరావు, మస్తాన్, అర్చకులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్లు కిటకిట

ఖమ్మం ఖానాపురంహవేలీ/ కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి 13: సంక్రాతి పండుగ నేపథ్యంలో ప్రయాణికులతో బస్టాండ్‌లు కిక్కిరిశాయి. ఖమ్మం నుంచి భద్రాచలం, కొత్తగుడెం, మణుగురు, కోదాడ, సూర్యాపేటకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు సరిపడా లేకపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఖమ్మం నుంచి భద్రాచలం, కొత్తగుడెం రూట్లకు బస్సులు తక్కువగా ఉండటంతో ప్రయాణికులు గంటల కొద్దీ బస్టాండ్‌లలో వేచిఉన్నారు. కోదాడకు ఎక్స్‌ప్రెస్ బస్సులను నడపకుండా కేవలం పల్లెవెలుగు బస్సులను నడపటంతో ప్రయాణికులు ఎక్కువగా నూతన బస్టాండ్‌కు వచ్చి బస్సులు లేవని తెలుసుకుని మళ్లీ సిటీ బస్టాండ్‌కు ఆటోల్లో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పండుగ సీజన్‌లో అదనపు బస్సులను ఏర్పాటు చెయ్యవల్సిన అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చెయ్యకుండా, ఉన్న బస్సులనే నడపటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

కిక్కిరిసిన కొత్తగూడెం బస్టాండ్

కొత్తగూడెంలో గంటల తరబడి ఉంటేనే తప్ప బస్సు ఎక్కి ప్రయాణించే అవకాశం లేదని మండిపడుతున్నారు. కుటుంబ సమేతంగా సంక్రాంతి సెలవుల్లో వివిధ ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు వర్ణనాతీతం. దానికి తోడు రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టి మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో కిక్కిరిసిన ఆర్టీసీ బస్సుల్లో సెలవు దినాల్లో వెళ్లాలంటే సాహసం చేయాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో కొత్తగూడెం 33, మణుగూరు 23, భద్రాచలం 45, ఇల్లెందు 16 డిపోల నుంచి సంక్రాంతి పండుగ ప్రత్యేక సర్వీసులను నడిపిస్తున్నారు. అయినప్పటికీ ప్రయాణికుల సంఖ్యఅధికంగా ఉండటంతో మరిన్ని బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు అధికారులను కోరుతున్నారు. ఈ నెల 17వ తేదీ వరకు పాఠశాలలు, 18వ తేదీన ప్రభుత్వ కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవులను ప్రకటించిన సంగతి తెలిసిందే.

తాగునీటి కోసం 500 క్యూసెక్కుల సాగర్ జలాల విడుదల

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 13: ఖమ్మం మునిసిపాలిటీలో ప్రజల తాగునీటి అవసరాల కోసం పాలేరు నుంచి 500 క్యూసెక్కుల నీటిని శనివారం విడుదల చేశారు. పాలేరులో ప్రస్తుతం 14.04 అడుగుల నీటి మట్టం ఉంది. 1.259 క్యూసెక్కుల నీళ్లున్నాయి. అయితే నగరంలో మంచినీటి పథకాలకోసం, తాగునీటి అవసరం కోసం ఈ నీటిని విడుదల చేశారు. నగరంలో ఇప్పటికే మిషన్ భగీరథకు అనుసంధానం చేశారు. ఈ నేపథ్యంలో విడుదల చేసిన నీటిని పల్లెగూడెం రెగ్యులేటర్ నుంచి ఎస్కేపు లాకులు ద్వారా మున్నేటికి నీటిని విడుదల చేస్తున్నారు. అక్కడి నుంచి దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్‌కు చేరేలా ప్రణాళికలను తయారు చేశారు. దీనితో పాటు ప్రధాన కాలువపై టేకులపల్లి వద్ద కూడా అడ్డుకట్ట వేస్తున్నారు. పాలేరు నుంచి వదిలిన నీళ్ల ఇక్కడి నుంచి కిందికి వెళ్లకుండా ఈ అడ్డుకట్ట ద్వారా అక్కడే ఉన్న మేజర్ నుంచి లకారం చెరువుకు తరలించాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన కాలువపై మునిసిపల్ అధికారులు అడ్డుకట్టను కడుతున్నారు.

గోవా టూర్‌లో వీవీ పాలెం సొసైటీ డైరెక్టర్లు

రఘునాథపాలెం, జనవరి13: ఉమ్మడి జిల్లాలో తొలి అవిశ్వాసం ప్రవేశ పెట్టిన రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెం 11మంది సొసైటీ డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీ నిర్ణయం మేరకు గోవా టూర్‌కు వెళ్లారు. పర్యటనలో భాగంగా శనివారం ఓ ప్రాంతంలో ఆగిన సొసైటీ డైరెక్టర్లు సంక్రాంతి సంబురాల్లో పాల్గొన్నారు. అనంతరం విజయం సింబల్ చూపిస్తు సోషల్ మీడియాలో ఫొటోలను విడుదల చేశారు. కాగా ఈనెల 27న వీ వెంకటాయపాలెం సొసైటీ అవిశ్వాన సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించారు. అవిశ్వాన సమావేశం రోజునే జిల్లాకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



విక్టరీ సింబల్ చూపుతున్న సొసైటీ డైరెక్టర్లు

మహిళా కండక్టర్‌తో మహిళల ఘర్షణ

జూలూరుపాడు, జనవరి 13 : ఆర్టీసీ బస్సులో మహిళా కండక్టర్‌తో కొంత మంది మహిళలు వాగ్వాదానికి దిగారు. దుర్భాషలాడటంతో సదరు కండక్టర్ కన్నీటి పర్యంతమైన సంఘటన శనివారం మండలంలోని దండుమిట్టతండా గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కొత్తగూడెం డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు ఖమ్మం నుంచి కొత్తగూడెం వెళ్తున్నది. ఈ క్రమంలో జూలూరుపాడులోని బస్టాప్ వద్ద మండలంలోని గుండెపూడికి చెందిన ఆరుగురు మహిళలు బస్సు ఎక్కారు. దీంతో కండక్టర్ టిక్కెట్లు కొడుతున్న క్రమంలో ఆధార్‌కార్డులు చూపించాలని మహిళలను కోరింది. తమకు ప్రభుత్వం బస్సులో ఉచిత ప్రయాణం కల్పిస్తే ఆధార్‌కార్డులు అడగటం ఏమిటని, తమ వద్ద లేవని సదరు మహిళలు చెప్పారు. దీంతో టిక్కెట్లు తీసుకోవాలని కండక్టర్ వారిని కోరారు. ఈ క్రమంలో మహిళలు కండక్టర్‌తో ఘర్షణకు దిగారు. మీరు మా మీద బతుకుతున్నారని, మా వల్లే నీకు వేతనం వస్తుందని కండక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నోటికి ఇష్టం వచ్చినట్లు మహిళలు మాట్లాడటంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. టిక్కెట్ తీసుకునేందుకు సదరు మహిళలు నిరాకరించారు. దీంతో డ్రైవర్ పావు గంటకు పైగా బస్సును నిలిపివేశారు. ఆధార్‌కార్డులు లేనప్పుడు ఉచిత ప్రయాణం వర్తించదని, తప్పని సరిగా టిక్కెట్లు తీసుకోవాలని ప్రభుత్వం నిబంధన విధించిందని తోటి ప్రయాణికులు, స్థానికులు మహిళలకు చెప్పారు. వారు టిక్కెట్లు తీసుకోవడంతో ఘర్షణ సద్దుమణిగింది. జరిగిన సంఘటనపై డిపో మేనేజరుకి ఫిర్యాదు చేస్తానని మహిళ కండక్టర్ అన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఖమ్మంక్రైం, జనవరి 13: కోడిపందేలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుం టామని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎక్క డైనా కోడిపందేలు నిర్వహిస్తున్నట్టు తెలిసినా డయల్100కు లేదా స్పెషల్ బ్రాం చ్ కంట్రోల్‌రూం వాట్సాప్ నెంబర్8712659123 నెంబర్‌కు సమాచారం తెలియ చేయాలని సీపీ ప్రకటనలో తెలిపారు. ప్రజలందరు సంక్రాంతి పండుగను కుటుంబసభ్యులతో సంతోషంగా జరుపుకోవాలన్నారు.

పొంగులేటి విజయప్రస్థానం వీడియో విడుదల

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి13: రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రాజకీయ యాత్రపై రూపొందించిన పొంగులేటి విజయ ప్రస్థానం వీడియోను ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి శనివారం విడుదల చేశారు. రైట్ చాయిస్ అకాడమీ చైర్మన్ మొండెం కిరణ్‌కుమార్ శీనన్న శపథం పేరుతో ఈవీడియోను రూపొందించి తుంబూరి దయాకర్‌రెడ్డి చేతుల మీదుగా విడుదల చేయించారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ పొంగులేటి రాజకీయంగా ఎదుర్కొన్న ఆటుపోట్లను వీడియోలో చూపించారని పేర్కొన్నారు.

ఏజెన్సీలో ప్రతీ రైతుకు

పామాయిల్ మొక్కలు అందించాలి

ఆయిల్ ఫెడ్ అధికారులకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం

దమ్మపేట, జనవరి 13 :ఏజెన్సీలో అడిగిన ప్రతీ రైతుకు పామాయిల్ మొక్కలు అందించాలని వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయిల్ ఫెడ్ అధికారులను ఆదేశించారు. దమ్మపేట మండలంలోని గండుగులపల్లిలోని ఆయన నివాసంలో తుమ్మలను పలు శాఖల అధికారులు శనివారం కలిశారు. ఈసందర్భంగా తుమ్మల ఆయిల్‌ఫెడ్ అధికారులతో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పామాయిల్ మొక్కలు ఇవ్వాలని అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ డివిజనల్ అధికారి బాలకృష్ణను ఆదేశించారు. భూములకు రికార్డులు లేవనే సాకుతో పామాయిల్ మొక్కలు ఇవ్వకుండా తిరస్కరించవద్దన్నారు. రైతుల వద్ద ఏరికార్డులు ఉంటే వాటిని పరిశీలించాలని, ఏమీ లేకుంటే క్షేత్రస్థాయి పరిశీలన చేసి పామాయిల్ మొక్కలు ఇవ్వాలన్నారు. నిరుపయోగంగా వున్న భూములలో కూడా సాగులోకి తెచ్చి పామాయిల్ సాగు చేసే విధంగా ఆయిల్‌ఫెడ్ అధికారులు చూడాలన్నారు. ఆయిల్‌ఫెడ్ పనితీరుపై కొద్ది రోజులలో సమీక్ష నిర్వహిస్తామని, దీనికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం అశ్వారావుపేట నియోజక పరిధిలోని వ్యవసాయాదికారులు ఏడీఏ అఫ్జల్‌బేగం తుమ్మలను కలవగా సంక్రాంతి పండగ అనంతరం వ్యవసాయం పై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని, అందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకూడదని, కోడిపందాలు, పేకాట నిర్వహించకుండా చూడాలని పాల్వంచ డీఎస్పీ వెంకటేష్‌ను ఆదేశించారు. దమ్మపేట మండలంలో పలు సమస్యలపై తుమ్మలను కొయ్యల అచ్యుతరావుతో పాటు స్థానిక నాయకులు కలిశారు. వాటిని సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ కార్యకర్తలు తుమ్మలను కలిసి సత్కరించారు.



ఆయిల్‌ఫెడ్, ఉద్యాన అధికారులతో మాట్లాడుతున్న తుమ్మల

రేషన్ బియ్యం పట్టివేత

పాల్వంచ, జనవరి 13: మండలంలో శనివారం రూరల్ పోలీసులు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యన్ని స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన పోశెట్టి నరేష్ తన ట్రాలీ ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం పోలీసులకు అందింది. ఆ సమయంలో ఉల్వనూరులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండటంతో సమాచారం రాగానే వెంటనే స్పందించిన పోలీసులు లక్ష్మీదేవిపల్లి చేరుకుని బంగారుచెలక వైపు వెళుతున్న ట్రాలీ ఆటోను నిలిపి తనిఖీ చేశారు. అందులో 11 క్వింటాళ్ళ రేషన్ బియ్యం ఉండటంతో నిందితుడిని, ట్రాలీని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

జాతీయ రహదారిపై కారు పల్టీ

ఖమ్మం రూరల్, జనవరి 14: ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై ఓ కారు పల్టీ కొట్టిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, తల్లంపాడు వద్ద శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపాన వివరాల ప్రకారం సూర్యాపేట నుంచి ఖమ్మం వస్తున్న కారు మార్గంమధ్యలో తల్లంపాడు వద్దకు రాగానే ప్రమాదవశాత్తు అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఆ సమయంలో కారులో ఇద్దరు వ్యక్తులు ప్రయానిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలైయ్యాయి. ఈ ప్రమాదినికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

టార్గెట్.. దమ్మాలపాటి

- ఇల్లెందు మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాసంతో కాంగ్రెస్ అప్రమత్తం
- వెంకటేశ్వరరావును తొలగిస్తే చేయందుకుంటాం!
- బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల ఆఫర్





అవిశ్వాస నోటీస్‌ను కలెక్టర్‌కు అందజేసిన కౌన్సిలర్లు

ఇల్లెందు, జనవరి 13: ఇల్లెందు మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావును పదవి నుంచి తొలగించడానికి 19మంది కౌన్సిలర్లు అవిశ్వాస నోటీస్ ఇవ్వడంతో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీఆర్‌ఎస్ మున్సిపల్ చైర్మన్లను అవిశ్వాసల ద్వారా తొలగిస్తూ ఇతర పార్టీల కౌన్సిలర్లను పార్టీలోకి చేర్చుకుంటూ దూసుకెళ్తున్న కాంగ్రెస్‌కు ఇల్లెందులో ప్రతికూల పరిస్థితి తలెత్తింది. ఇల్లెందు మున్సిపాలిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు మరో ముగ్గురు కౌన్సిలర్లు అసెంబ్లీ ఎన్నికల తరుణంలోనే కాంగ్రెస్‌లో చేరారు. అయితే అంతకుముందు ఏడాది కాలంగా వెంకటేశ్వరరావుపై వివిధ రకాల ఆరోపణలు చేస్తూ అవిశ్వాస నోటీసులు ఇచ్చిన కౌన్సిలర్లు నిబంధనలు అడ్డురావడంతో మిన్నకుండి పోయారు. కాగా ఇటీవల మున్సిపల్ చైర్మన్ల పిటీషన్లను హైకోర్టు కొట్టివేయడం, నాలుగేళ్ల పదవీ కాలం పూర్తికావడంతో పాటు కాంగ్రెస్ అధికారం లోకి రావడంతో అవిశ్వాసాలు ఊపందుకున్నాయి. ఇల్లెందులో సైతం బీఆర్‌ఎస్‌లో కొనసాగిన దశలోనే వెంకటేశ్వరరావును పదవి నుంచి తొలగించడానికి బీఆర్‌ఎస్ నాయకులు ప్రయత్నించారు. ఫలితంగా అసెంబ్లీ ఎన్నికల తరుణంలోనే మరో ముగ్గురు కౌన్సిలర్లతో పాటు వెంకటేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరి బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు తీవ్రంగా కృషి చేశారు. అయితే గత ఏడాదిన్న కాలంగా వెంకటేశ్వరరావును టార్గెట్ చేసిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసాల గడువు అవకాశం లభించడంతో సీపీఐ, న్యూడెమోక్రసీ పార్టీలకు చెందిన కౌన్సిలర్లతో పాటు మొత్తం 19 మంది కౌన్సిలర్ల సంతకాలతో జిల్లా కలెక్టర్ ప్రియాంక అలకు నోటీస్ అందజేశారు.

పలు ఫిర్యాదులు

బీనామీ పేర్లతో వెంకటేశ్వరరావు కాంట్రాక్టర్లు సాగిస్తున్నాడని, మహిళా కౌన్సిలర్ల పట్ల అమర్యాద గా ప్రవర్తిస్తున్నాడని పలు రకాల ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ మద్యం వ్యాపారీ సతీమణిని చైర్మన్‌గా చేయాలన్న పట్టుదలతో గత కొద్ది నెలలుగా పావులు కదుపుతున్న అసమ్మతి కౌన్సిలర్లు అవిశ్వాసాలకు అవకాశం లభించడంతో యత్నాలకు పదును పెట్టారు. వెంకటేశ్వరరావు మాజీ ఎమ్మెల్యే హరిప్రియకు టికెట్ ఇవ్వొద్దని, పార్టీ ఓడిపోతుందని వివిధ మండాల అసమ్మతి వాదులను కూడకట్టి బీఆర్ఎస్ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతో మాజీ ఎమ్మెల్యే దంపతులతో పాటు వారి అనుచరులు ఆయనపై మరింత ఆగ్రహం పెంచుకున్నారు. ఈ పరిణామాలతోనే కాంగ్రెస్‌లో చేరి ఇల్లెందు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య విజయంలో కీలక పాత్రం పోషించారు.

వ్యూహాలకు పదును

కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇల్లెందులో బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు తామంతా కాంగ్రెస్‌లో చేరుతామని, అయితె చైర్మన్ పదవీ నుంచి వెంకటేశ్వరరావును తొలగించాలనే షరతులతో కాంగ్రెస్ నేతలతో రాయబారాలు చేసిన ట్లు సమాచారం. అయి తే బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల షరతును ఎమ్మెల్యే కోరం కనకయ్య వ్యతిరేకించడం, వెంకటేశ్వరరావును పదవి నుంచి తొలగించబోమని స్పష్టం చేయడంతో మరో పర్యాయం అవిశ్వాసానికి తెరలేపారు. ఈ నేపథ్యంలో అవిశ్వాసాన్ని ఎదుర్కొవడానికి కాంగ్రెస్ నాయకులు సమాయత్తమయ్యారు. రాష్ట్రమంతటా కాంగ్రెస్‌లో చేరుతున్న కౌన్సిలర్లతో బీఆర్‌ఎస్ మున్సిపల్ చైర్మన్లను అవిశ్వాసాలతో పదవుల నుంచి తొలగిస్తున్న పరిస్థితుల్లో ఇల్లెందులో మాత్రం అందుకు భిన్నమైన పరిణామాలు తలెత్తడంతో కాంగ్రెస్ అధినాయకత్వం అప్రమత్తమై పోటీ వ్యూహాలకు పదును పెడుతున్నారు.

చేతులు మారిన డబ్బు?

అవిశ్వాసం నుంచి వెంకటేశ్వరరావును గట్టెక్కించడానికి కాంగ్రెస్ పెద్దలు రంగంలో దిగారు. అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లను దారిలోకి తెచ్చుకునేందుకు వివిధ రకాలుగా యత్నాలు చేపట్టారు. అయితే అవిశ్వాసం పెట్టిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు తాముకూడా కాంగ్రెస్‌లో చేరుతామని, వెంకటేశ్వరరావు చైర్మన్‌గా ఉండకూడదనే షరతు విధిస్తూ టార్గెట్ చేయడంతో కాంగ్రెస్ ఎత్తుకు పై ఎత్తులు వేస్తుంది. కాగా వెంకటేశ్వరరావును పదవి నుంచి తొలగించి ఒక ప్రముఖ నాయకుని సతీమణిని చైర్మన్‌గా చేయాలన్న పట్టుదలతో గతంలోనే పెద్ద మొత్తాల్లో కౌన్సిలర్లు డబ్బులు ముట్టజెప్పడం తెలిసిందే. తాజా పరిణామాలతో మరో పర్యాయం కూడా పెద్ద మొత్తాల్లో అవిశ్వాసంపై సంతకాలు చేసిన కౌన్సిలర్లకు ముడుపులు ముట్టజెప్పారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

కబ్జాలపై నజర్

19 మంది అవిశ్వాస కౌన్సిలర్లను దారిలోకి తెచ్చుకునే యత్నాలు కాంగ్రెస్ నాయకత్వం ముమ్మరం చేసింది. ఆ కౌన్సిలర్లను అవిశ్వాసం నుంచి తప్పించేందుకు పలు రకాలుగా యత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ససేమీరా అంటున్న కౌన్సిలర్లను తమకు అనుకూలంగా మలుచుకోవడానికి పట్టణంలోని భూకబ్జాలు, సంక్షేమ పథకాల్లో చేతివాటాలు, బీనామి పేర్లతో సాగిస్తున్న అక్రమాలు, సింగరేణి నిర్వాసిత ప్రాంతాల్లో పునవాస పథకాల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఫిర్యాదులు ఉండటంతో వాటిని ఆరా తీస్తున్నట్లు తెలిసింది. అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లను దారికి తెచ్చుకునేందుకు కాంగ్రెస్ ముమ్మరంగా యత్నాలు చేస్తున్నారు. అవిశ్వాసం తీర్మానం ఓటింగ్‌కు వెళ్లకముందే వెంకటేశ్వరరావు వ్యతిరేక కౌన్సిలర్లను దారిలోకి తెచ్చేందుకు వివిధ రీతిల్లో కాంగ్రెస్ నేతలు చేస్తున్న యత్నాలు ఏ రూపం సంతరించుకుంటాయోనన్న ఉత్కంఠ నెలకొన్నది. ఈ పరిణామంతో ఇల్లెందులో ఎక్కడ చూసినా దీనిపైనే చర్చ జరుగుతోంది.

గంజాయి, చైన్‌స్నాచింగ్ కేసులో ముగ్గురి అరెస్ట్

- పరారీలో మరొకరు.. అరెస్టయినవారిలో ఒకరు మైనర్
- వివరాలు వెల్లడించిన ఏసీపీలు హరికృష్ణ, శివరామయ్య



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఖమ్మం, జనవరి13(ఆంధ్రజ్యోతి): గంజాయి, చైన్ స్నాచింగ్‌లతోపాటు ద్విచక్రవా హనాల చోరీ చేసిన కే సులో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, రూ.2.65 ల క్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు ఖ మ్మం టౌన్ ఏసీపీ ఎస్వీ హరికృష్ణ, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శివరామయ్యలు తెలిపారు. ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. ఖమ్మం సీపీ సునీల్ దత్ ఆదేశాల మేరకు విధినిర్వాహణలో భాగంగా శనివారం నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తోండగా నంబరు లేని ద్విచక్రవాహ నంపై ముగ్గురు వ్యక్తులు వస్తుండగా అనుమానంతో ఆ వాహనాన్ని పోలీసులు ఆపడంతో ముగ్గురిలో ఓ వ్యక్తి పారిపోయినట్టు ఏసీపీలు తెలిపారు. మిగిలిన ఇద్దరు వద్ద లగేజీ బ్యాగులో రెండు ప్లాస్టిక్ కవర్లలో సుమారు రెండు కేజీల గంజాయి ప్యాకెట్లను గుర్తించినట్టు వారు తెలిపారు. కాగా ఆ ఇద్దరు వ్యక్తులను పంచుల సమక్షంలో విచారించగా ఒకరు ఖమ్మం నగరానికి చెందిన సయ్యద్ మౌలానా అలియాస్ అఫ్రోజ్ ఏసీ మెకానిక్ పనిచేస్తున్నట్టు, మరో వ్యక్తి మైనర్‌గా గుర్తించామన్నారు. పారిపోయిన వ్యక్తిని ఖాసీంగా గుర్తించినట్టు వారు తెలిపారు. కాగా అఫ్రోజ్, ఖాసీంలు గత మూడు రోజుల క్రితం ఒడిశాలోని చిత్రకూట్ ఏరియా నుంచి మోటార్ సైకిల్‌పై గంజాయిని తీసుకొచ్చి దానిని ఖమ్మం పరిసర ప్రాంతాల్లో అమ్ముకునేందుకు వెళ్తున్న క్రమంలో పోలీసులకు చిక్కినట్టు తెలిపారు. వారిని విచారించిన క్రమంలో అఫ్రోజ్ మహబూబాబాద్‌లో ఓ మోటార్ సైకిల్‌ను, మైనర్ బాలుడు ఖమ్మం ఒకటోపట్టణంలో స్కూటీని దొంగిలించినట్టు ఇరువురు కలిసి ఐదు రోజుల క్రితం ఖానాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉదయం వృద్ధురాలు మెడలో మూడు తులాల గొలుసును దొం గిలించినట్టు అంగీకరించి నట్టు వారు పేర్కొన్నారు. సదరు బంగా రాన్ని మరో నేరస్థుడు విజయేం ద్ర ద్వారా మరిపె డలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టినట్టు తేలింద న్నారు. దాంతో సదరు నేరస్థుడు విజయేంద్రను కూడా అరెస్ట్ చేసినట్టు ఏసీపీలు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 2.65 లక్షల విలువైన రెండు ద్విచక్ర వాహనాలను, బంగారం తాకట్టు పెట్టిన రశీదుతోపాటు, రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు వారు తెలిపారు. కేసును ఖానాపురం హవేలీ పోలీసులు దర్యాప్తు చేస్తుండగా, సహకరించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులను వారు అభినందించారు. ఈ సమావేశంలో ఖానాపురం హవేలీ సీఐ తుమ్మలపల్లి శ్రీహరి, ఎస్ తిరుపతి, ఎస్‌ఐలు రాము, వీరేందర్‌లు పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ: ఒకరు మృతి



సంఘటనా స్థలంలో మృతి చెందిన శ్రీను

పాల్వంచ, జనవరి 13 : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన పై పాల్వంచ రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. టేకులపల్లి మండలం సంపత్ నగర్‌కు చెందిన పల్లపు శ్రీను(40) స్థానికంగా కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భద్రాచలం హాస్టల్‌లో చదువుతున్న తన ఇద్దరు పిల్లలకు సెలవులు ఇవ్వడంతో వారిని తీసుకుని రావడానికి అక్కడికి వెళ్లాడు. వారిని తీసుకుని ద్విచక్రవాహనంపై పాల్వంచ వైపు వస్తున్నాడు. అదే సమయంలో తిమ్మారావుపేటకు చెందిన ఈసం జగదీష్ భద్రాచలంవైపు తన ద్విచక్రవాహనంపై వేగంగా వెళుతున్నాడు. బీపీఎల్ బంకు మేనేజర్‌గా విదులు నిర్వహిస్తున్న అతడు అతి వేగంగా వాహనం నడుపుతూ.. ఆర్‌టీఏ చెక్‌పోస్ట్ ప్రాంతంలో ఎదురుగా వస్తున్న పల్లపు శ్రీను వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో వాహనంపై నుంచి రోడ్డుపై పడ్డ శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. వాహనంపై ఉన్న చిన్నారులు సురక్షితంగా బయటపడ్డారు. మరో వాహనంపై ఉన్న జగదీష్‌కు స్వల్పంగాయాలయ్యాయి. తలకు తీవ్రగాయాలైన శ్రీనును స్థానికులు హుటాహుటిన పాల్వంచ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

బైక్‌లు ఢీ.. నలుగురికి గాయాలు

జూలూరుపాడు, జనవరి 13: మండలంలోని వెంగన్న పాలెంలోని ముత్యాలమ్మ తల్లి ఆలయ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు శనివారం ఢీకొన్న సంఘటనలో నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన దుద్దుకూరి కృష్ణ ప్రసాద్ ద్విచక్రవా హనంపై పొలానికి వెళ్తున్నాడు. అదే సమ యంలో నల్లబండ బోడుకు చెందిన బచ్చల సూర్యప్రకాష్, బచ్చల రేవంత్‌కుమార్, మోడం రాహుల్ ము గ్గురు యువకులు కలిసి ఒకే ద్విచక్రవా హనంపై పెట్రోల్ కొట్టించుకునేందుకు గుండెపూడి వైపు నుంచి జూలూరుపాడులోని పెట్రోల్ బంకు వద్దకు వస్తున్నారు. ఈ క్రమంలో వెంగన్నపాలెంలోని ముత్యాలమ్మతల్లి ఆలయ స మీపం వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో నలుగు రికి గాయాలయ్యాయి. వీరిలో ద్విచక్రవాహణం నడుపు తున్న బచ్చల సూర్యప్రకాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారికి చికిత్సలు అందించేందుకు స్థానికులు జూలూరుపాడులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ పురుషోత్తం సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు. ఆసుపత్రిలో క్షతగాత్రులను పరిశీలించారు. ద్విచక్రవాహనాలు నడుపుతున్న బచ్చల సూర్యప్రకాష్, దుద్దుకూరి కృష్ణ ప్రసాద్‌లు మద్యం సేవించి వాహనాలను నడుపుతున్నారో తెలుసుకునేందుకు మిషన్‌ద్వారా పరిశీలించారు. నల్లబండబోడుకు చెందిన బచ్చల సూర్యప్రకాష్ మద్యం సేవించినట్లు గుర్తించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదానికి కారకుడైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

జూలూరుపాడు, జనవరి 13: రహదారిపై వాహనాన్ని నిలిపి ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై శనివారం జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణాజిల్లా మచిలిపట్టణానికి చెందిన లారీ డ్రైవర్ చెంగాల బుచ్చయ్య డిసెంబర్ 11న రాత్రి 11. 30గంటల సమయంలో మండలంలోని వినోభానగర్ సమీపంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా రహదారిపై లారీని నిలిపి ఉంచాడు. అదే సమయానికి సూర్యాపేటకు చెందిన నిమ్మోజి రోహిత్ యువకుడు ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు వస్తూ రహదారిపైన ఆపి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో యువకుడి కాలు, చేరి విరిగాయి. కుటుంబసభ్యులు వైద్య చికిత్సలు అందించేందుకు రోహిత్‌ను ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

సినిమా ఛాన్స్
★ నటనలో సులభమైన పద్ధతిలో 3 నెలల శిక్షణ. తక్కువ ఫీజు. సినిమాల్లో షార్ట్ ఫిల్మ్స్‌లో అవకాశం. NEHA FILM INSTITUTE, Ameerpet, Hyderabad-500016. call: 9347401194 & 9100099700 AJH-002034

ADMISSIONS
★ రెగ్యులర్ & డిస్టెన్స్ : డిగ్రీ, PG, డిప్లొమా, B.Tech, M.Tech, D-Pharma, B-Pharma, B.Sc(Agri), B.Sc(Nursing), B.Ed., MBA, MCA Eligible for all Govt Jobs & Further studies. Ph: 8666977112 / 339 AJH-14065

LAND FOR SALE
కొత్తగూడెం శ్రీనగర్ గ్రామపంచాయతీ, శ్రీనగర్ 4వ లైనులో 205 చ.గ. స్థలము , ముందు పార్కింగ్ స్థలము 40 చ.గ. లు అమ్మకమునకు కలదు. సెల్: 9000414859 AJM-130989

WANTED
ఖమ్మంలోని ప్రముఖ జూనియర్ కాలేజీకి మార్కెటింగ్ ఏజెంట్స్ (PRO'S) ఈ క్రింది ప్రాంతాలలో కావలెను. కొత్తగూడెం, భద్రాచలం, చర్ల, సత్తుపల్లి, మరిపెడబంగ్లా, తొర్రూరు. సం.ప్ర. సెల్: 8885518151, 7675097755 AJM-2993

JOBS
» నిరుద్యోగులకు ఉపాధి అవకాశం ప్రముఖ సంస్థ నందు అభ్యర్థులు కావలెను. ఏరియా ఇంచార్జ్, ఏరియా మేనేజర్, మండల కో-ఆర్డినేటర్, జీతం : 15 వేల నుండి 30 వేల వరకు. సెల్ నెం. 9963483482, 9642559255 AJM-10858

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపలదు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడిఐటి

దుర్గాదేవి జ్యోతిష్యపీఠం
» దుర్గాదేవి జ్యోతిష్య పీఠం: యస్.వి. రాఘవేంద్రజోషి, పునర్వివాహం, దాంపత్య సమస్యలు, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, స్త్రీ ప్రేమ, వశీకరణం, ప్రతి సమస్యకు అంజనం, హోమాలతో 2 రోజుల్లో శాశ్వత పరిష్కారం. చూపగలము. సెల్: 6364 999 444 AJB-606

స్వదేశాగమనము/ విదేశీయానం, | పుట్టిన రోజు | వివాహ వార్షికోత్సవం
షష్టిపూర్తి | లీగల్ నోటీసులు | శ్రద్ధాంజలి
పదవీవిరమణ | వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు
4 Lines Classifieds Khammam + B-Kothagudem Dists 220/- Only Extra Line 45/- only
ఖమ్మం: 9985401672
ఖమ్మం 9985406151 9985401698
కొత్తగూడెం: 9985400885
భద్రాచలం: 9985411347

భార్య ఆత్మహత్య..? భర్త హత్య..?

- అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి
- ఆమె బంధువుల దాడి.. చనిపోయిన భర్త
- అచ్చంపేటలో దారుణం.. ఇరు కుటుంబాల్లో విషాదం



సింధు, నాగార్జున (ఫైల్)

అచ్చంపేట, జనవరి 13 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత చనిపోయింది. కుటుంబ కలహాలు, వరకట్నం, లైంగిక వేధింపుల ఆరోపణలు ఆమె మరణం చుట్టూ అలుముకున్నాయి. కట్టుకున్నోడి వల్లనే తమ బిడ్డ చనిపోయిందని ఆగ్రహించిన యువతి బంధువులు ఆమె భర్తపై దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు కానీ.. అతడు చనిపోయాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నిండింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సింధు(26)కు పట్టణంలోని శ్రీరాం(సరిరాం) ఆస్పత్రిలో పని చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నాగార్జునతో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. మూడేళ్ల క్రితం వీరు హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం అక్కడే ఉండి తర్వాత అచ్చంపేటకు వచ్చి శ్రీరాం ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఏడాది క్రితం దంపతుల మధ్య గొడవలు జరగడంతో సింధు.. బిజినేపల్లిలోని అమ్మమ్మ గారి ఇంటికి వెళ్లిపోయింది. నాగార్జున పోలీసులను ఆశ్రయించడంతో ఆమె తిరిగి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, డబ్బు కోసం భర్త వేధింపుల నేపథ్యంలో ఇరువురి మధ్య మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సింధు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కొన ఊపిరితో ఉన్న ఆమెకు భర్త నాగార్జున.. శ్రీరాం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా సింధు చనిపోయింది. ఈ విషయాన్ని నాగార్జున.. సింధు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో ఆమె బంధువులు ఒక వాహనంలో అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. నాగార్జునను తమ వాహనంలో ఎక్కించుకొని తీవ్రంగా దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు గానీ.. నాగార్జున చనిపోయాడు. అతడిని కొట్టి చంపేశారని నాగార్జున తల్లి, చెల్లెలు ఆరోపిస్తున్నారు. కాగా, తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సింధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగార్జున, డాక్టర్ కృష్ణ, అతడి భార్య హైమావతి ఇదంతా చేశారని చెప్పారు. డాక్టర్ కృష్ణ తమ కూతురిని పలుమార్లు లైంగికంగా వేధించాడని తెలిపారు. నాగార్జున మృతిపై అతడి కుటుంబీకులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

కొత్తూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓ 16 నెలల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడి మృతిచెందింది. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్‌లో శనివారం జరిగింది. బిహార్‌కు చెందిన ధర్మేందర్ దంపతులు కొత్తూర్ నారాయణగూడ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ధర్మేందర్ శనివారం పనికి వెళ్లాడు. అతని భార్య ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా పెద్ద కుమార్తె రియా (16 నెలల) ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడిపోయింది. నీటి బకెట్‌లో చిన్నారి మృతి చెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అప్పులు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య

ఖానాపూర్, జనవరి 13 : పత్తి పంట దిగుబడి రాకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం చందునాయక్ తండాకు చెందిన గుగ్లావత్ శ్రీకాంత్ (26) రెండు ఎకరాల్లో పత్తి వేశాడు. ఈ సారి ఆశించినంత దిగుబడి రాలేదు. దీనికి తోడు తన అక్క పెళ్లి కోసం చేసిన రూ.3 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మథన పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

బస్సు మంటల్లో మసైపోయి..

గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం



మంటల్లో పూర్తిగా కాలిపోయిన బస్సు, ఇన్‌సెట్లో... మాలతి(ఫైల్)

గద్వాల, గద్వాల క్రైం /ఎర్రవల్లి, నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడ్డ ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాకమునుపే ప్రయాణికుల్లో కొందరు ఎలాగో అలా బయటపడ్డారు. చాలామందిని స్థానికులే రక్షించారు. ఒక్క మహిళ మాత్రం ఆ బస్సులోనే ఉండిపోయింది. రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించాయి. ఆ మంటల్లో ఆమె కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారక ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం తెల్లవారుజామున బీచుపల్లి-ఎర్రవల్లి మధ్య బోల్తా పడింది. ఆ వెంటనే బస్సు ముందు భాగంలో మంటలంటుకున్నాయి. మృతురాలిని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలతి (45)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి చిత్తూరుకు బయలుదేరింది. బస్సుల్లో 42 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల దాబా దాకా ఒక డ్రైవర్ బస్సు నడిపాడు. తర్వాత ఒంటి గంట సమయంలో స్టీరింగ్ రెండో డ్రైవర్ తీసుకున్నాడు. బీచుపల్లి దాటిన తర్వాత, పదవ బెటాలియన్ సమీపంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హార్వెస్టర్ గ్యారేజీ కార్మికులు, పెట్రోల్ బంక్ వర్కర్లు హుటాహుటిన స్పందించారు. బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. పోలీసులు కూడా సహాయక చర్యలు చేపట్టారు.ఆ వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. మంటల్లో మాలతి అనే ప్రయాణికురాలు చిక్కుకుపోయారు. ఆమె చెయ్యి బస్సు సీటు సందులో ఇరుక్కుపోవడంతో తప్పించుకునేందుకు వీల్లేకపోయినట్లు తెలుస్తోంది. కాపాడండి అంటూ ఆమె ఆర్తనాదాలు చేస్తున్నా, అప్పటికే మంటలు తీవ్రం కావడంతో ఎవరూ ఆమెను రక్షించే సాహసం చేయలేకపోయారు. అందరి కళ్ల ముందే ఆమె సజీవ దహనమయ్యారు. మాలతిది చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, పుత్తమర్ల గ్రామం. ఆమె హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని రైస్ రీసెర్చ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భర్త శ్రీనివాస్ కూడా హైదరాబాద్‌లోనే వ్యాపారం చేస్తుండటంతో ఆ కుటుంబం నగరంలోని లంగర్‌హౌజ్‌లో ఉంటోంది. భర్త శ్రీనివాస్ తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో రెండ్రోజుల క్రితం ఆమె చిత్తూరుకు వెళ్లిపోయారు. మాలతి కూడా శుక్రవారం రాత్రి బస్సులో సొంతూరుకు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఘటన జరగ్గా, ఉదయం ఏడు గంటల దాకా మాలతి మృతదేహం కాలుతూనే ఉంది.. తన కళ్ల ముందే మాలతి మంటల్లో సజీవదహనమైందని గద్వాల వాస్తవ్యుడు కలీం అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. హైదరాబాద్ నుంచి ఊరికి వెళుతుండగా బస్సుకు మంటలంటుకోవడాన్ని గమనించి అక్కడికి వెళ్లానని ఆయన చెప్పారు. కాగా డ్రైవర్ నిద్రమత్తే బస్సు ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలోనే మాలతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ఘటనాస్థలికి వెళ్లారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. 2002 సెప్టెంబరు 5న గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపురం వద్ద హైదరాబాద్ నుంచి కడప జిల్లా రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 31 మందిలో 13 మంది చనిపోయారు. మరో 18 మందికి తీవ్రగాయాలయ్యాయి. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వాల్వో బస్సు కొత్తకోట మండలం పాలెం వద్ద కల్వర్టుకు ఢీకొని రాసుకుపోవడంతో మంటలు చేలరేగి బస్సుకు మంటలంటుకున్నాయి.. ఈ ఘోర దుర్ఘటనలో 45 మంది సజీవదహనం అయ్యారు.

గుంతలోకి 3 వాహనాలు.. తల్లి, కొడుకు దుర్మరణం!

- ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టిన కారు
- అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్న ఆటో
- 3 వాహనాలూ గుంతలోకి.. కారులోని తల్లి, కుమారుడి మృతి

శంషాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక వాహనం అదుపు తప్పడం.. ఆ వాహనంతో పాటు మరో రెండు వాహనాలను ప్రమాదం బారిన పడేసింది! మూడు వాహనాలూ రోడ్డు పక్కన ఓ గుంతలో పడ్డాయి. ప్రమాదానికి గురైనవి కారు, ఆటో, బైక్! ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఘాంసిమియాగూడ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. శంషాబాద్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాప్రా మునిసిపాలిటీ శ్రీరాంనగర్‌కు చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సైంటిఫిక్ ఆఫీసర్ మెరువ ఆదిశేషారెడ్డి(57), తల్లి రాములమ్మ(88)తో కలసి కారులో హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళుతున్నారు. ఘాంసిమియాగూడ వద్దకు రాగానే కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఫలితంగా ఆటో అదుపుతప్పి దాని ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఫలితంగా మూడు వాహనాలు ఒకదాని వెంట మరొకటి హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం నిర్మించిన కల్వర్టులో బోల్తాపడ్డాయి. ప్రమాదంలో కారులో ఉన్న ఆదిశేషారెడ్డి, రాములమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ఉన్న గొల్ల ఆంజనేయులు, వెనుక కూర్చున్న పద్నాలుగేళ్ల బాలిక, ఆటోడ్రైవర్ రాయన్నగూడ సిద్ధయ్య గాయపడ్డారు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు రోడ్డుపక్కనే పడిపోగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లీకుమారుల మృతదేహాలను కల్వర్టు నీటిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పండుగ సరుకుల కోసం వచ్చి..

పరలోకాలకు!

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చేర్యాల, జనవరి 13: సంక్రాంతి పండుగకు సరుకులు కొనేందుకు బయటికి వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాటర్‌పిల్లర్ మెషీన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి(39) శనివారం చేర్యాలకు పండుగ కోసం సరుకులు కొనేందుకు వచ్చింది. తర్వాత ఇంటికి వెళ్లేందుకు చూస్తుండగా తమ ఇంటి సమీపంలోని బంధువు కనకారెడ్డి కలిసి టీవీఎస్ ఎక్సెల్‌పై దొమ్మాటకు వెళ్తూ ఎక్కించుకున్నాడు. ఇటు జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ శివారులో కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. అక్కడ చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకొని కాటర్ పిల్లర్ మెషీన్‌తో ఆపరేటర్ నిర్లక్ష్యంగా కంకర మిశ్రమాన్ని చదును చేస్తూ వెనక వైపునకు తోలుతున్నాడు. ఇంతలో వెనక నుంచి వస్తున్న కనకారెడ్డి బండి అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడిపోయారు. అది గమనించని ఆపరేటర్ మెషీన్‌ను లక్ష్మి పైనుంచి తీయడంతో ఆమె మృతి చెందింది. కనకారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతురాలి కుటుంబీకులు, బంధువులు చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట రహదారిపై బైఠాయించారు.

పతంగి ఎగురవేస్తుండగా

విద్యుత్తు షాక్

- అత్తాపూర్‌లో 11 ఏళ్ల బాలుడి దుర్మరణం
- రైలు పట్టాలపై పడిన గాలి పటం
- నవాంద్గీ స్టేషన్‌లో రైలు ఢీకొని బాలుడి మృతి

రాజేంద్రనగర్/బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భవనంపై ఉన్న ఏసీ కాపర్ పైప్‌లైన్‌ను విద్యుత్ ప్రసారం జరిగి.. కరెంటు షాక్‌తో ఓ బాలుడు చనిపోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘోరం జరిగింది. అత్తాపూర్ రాంబాంగ్ మల్లయ్య టవర్స్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన అభిషేక్ కుటుంబం ఉంటోంది. అభిషేక్ సోదరుడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. అభిషేక్ వదిన చాలారోజుల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో వారి కుమారుడు తనిష్క్(11) పెదనాన్న అభిషేక్ వద్దే ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా అభిషేక్ కుమారుడు మోహిత్ పతంగి ఎగురవేసేందుకు మల్లయ్య టవర్స్ ముందు ఉన్న లక్ష్మీవాణి టవర్స్ పైకి వెళ్లాడు. అతడితో తనిష్క్ కూడా వెళ్లాడు. లక్ష్మీవాణి అపార్ట్‌మెంట్స్ పెంట్‌హౌస్‌పై ఇద్దరూ పతంగి ఎగురవేస్తుండగా అక్కడ ఏసీ ఔట్‌పుట్ కాపర్ పైప్‌లైన్‌కు తనిష్క్ తగిలాడు. దానికి అప్పటికే విద్యుత్తు ప్రసారం జరగడంతో షాక్‌తో చనిపోయాడు. గాలిపటం కోసం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని బాలుడు చనిపోయాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గీ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. బషీరాబాద్ మైనారిటీ కాలనీకి చెందిన అస్లామ్ కుమారుడు అబుజార్(9) గాలి పటం ఎగరేస్తున్నాడు. అది తెగి ఇంటి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపై పడటంతో పతంగి తీసుకునేందుకు బాలుడు పరుగు తీశాడు. అప్పటికే స్టేషన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉండటంతో దాని కింది నుంచి దూరి అటువైపు వెళ్తుండగా మరో ట్రాక్‌పై వస్తున్న రైలు ఢీకొట్టింది.

శంభులింగేశ్వరుడికీ అష్టకష్టాలు

- బిల్లు కట్టడంలేదని విద్యుత్ కనెక్షన్ కట్
- ప్రభుత్వ భవనాలకు దేవుడి భూమి...తరిగిపోయిన ఆస్తి
- ధూపదీప నైవేద్యాలకు చిల్లిగవ్వలేక ఇబ్బందులు
- ప్రాచుర్యాన్ని కోల్పోతున్న పురాతన శివాలయం

బోనకల్, జనవరి 13: నాడు ఎంతో ప్రాచుర్యం పొందిన బోనకల్ శివాలయం నేడు ఆదరణకు నోచుకోవడం లేదు. అన్ని ఉన్నా కాలనుగుణంగా వచ్చిన మార్పులతో దేవాలయంలో కొలువు తీరిన శంభులింగేశ్వరుడికి సైతం కష్టాలు తప్పడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు శతాబ్దాల క్రితం బోనకల్‌లో చిన్న పూరాతన శివాలయం ఉండేది. ఆ స్థలంలో గ్రామానికి చెందిన కొండపల్లి సీతారామయ్య అనే శివ భక్తుడు 1900 సంవత్సరంలో శివాలయాన్ని కట్టించారు. ఆలయ నిర్వహణకుగానూ తనకు చెందిన 36ఎకరాల భూమిని దానంగా స్వామిపేరు మీదుగా రాశారు. అప్పట్లో స్వామి వారికల్యాణం, పలు ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించారు. భక్తుల కోరికలను తీర్చే కొంగు బంగారంగా ఇక్కడి శివయ్యను ఆరాధిస్తుంటారు. అంతటి మహిమ గల దేవుడికి కష్టాలు మొదలయ్యాయి. నాడు దేవాలయం పేరు మీదుగా ఉన్న 18 ఎకరాల భూమిని నాటి అధికారులు బోనకల్‌లో తహసీల్దార్, ఎంపీడీవో, ఐకేపీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలతోపాటు పలు ప్రభుత్వ భవనాలకు కేటాయిస్తూ ఉత్తర్వులను ఇచ్చారు. దీంతో దేవాలయ భూమిలో ప్రభుత్వ కార్యాలయాలు కొలువు తీరాయి. మరో 5ఎకరాల భూమి ఎన్నెస్పీ కాలువ కింద పోవడంతో ప్రస్తుతం దేవుడి కింద 13 ఎకరాలు మాత్రమే ఉంది. ఈ భూమి మీద సరైన ఆదాయం రాకపోవడంతో ప్రతి నెల పూజారికి ఇచ్చే వేతనం, దూప, దీప నైవేద్యపు ఖర్చుల భారం పెరిగి ఆలయ నిర్వహణ కష్టమవుతోంది. దేవాలయంలో ఉన్న మీటరుకు సంబంధించి దాదాపు రూ.23 వేల బిల్లు రావడంతో అది కట్టే పరిస్థితి లేదు. విద్యుత్ అధికారులు కరెంటు కనెక్షన్ కట్ చేయడంతో మంగళవారం రాత్రి ఆలయంలో పూజారి సెల్‌ఫోన్ లైట్ వెలుగులో పూజా కార్యక్రమాలను పూర్తి చేశాడు. మూడు నెలలుగా పూజారికి వేతనం ఇవ్వకపోవడంతో తాను పని చేయలేననిచెప్పాడు. దేవాలయాన్ని దేవాదాయ పరిధిలోకి తీసుకు వస్తే ప్రతి నెల పూజారికి వేతనం అందుతుందని దాని వల్ల దేవాలయానికి పూర్వ వైభవం చేకూరే అవకాశం ఉందని ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. గతంలో దేవాలయాన్ని దేవాదాయ పరిధిలోకి తీసుకు రావాలని అనుకున్నా నిబంధనల సాకుతో అధికారులు చెక్ పెట్టారని పలువురు వాపోతున్నారు. దేవాలయం కింద ఉన్న భూమిని ప్రభుత్వ భవనాలకు తీసుకోవడంతోపాటు ఉన్న భూమికి సరైన ఆదాయ వనరు లేకపోవడంతో శివయ్య అన్ని ఉన్నా ఏమి లేని వాడీగా మిగిలాడని ఈ ప్రభుత్వంలోనైనా తగు ఆదరణ కల్పించేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



విద్యుత్ కనెక్షన్ నిలిపివేసిన బోనకల్ శివాలయం

వైజ్ఞానిక ఆవిష్కరణలకు పిలుపు

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు ఎన్‌సీఆర్‌టీఈ సదస్సులు

ఈ ఏడాది అంశం సైన్స్ విద్య- రైజింగ్ భారత్

ఖమ్మం ఖానాపురం, జనవరి 13: మానవ జీవనంలో సైన్స్‌కు ప్రా ముఖ్యత ఎంతో ఉంది. నిత్యం మన చుట్టూ ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు దోహదపడుతోంది. దీనికి ముగింపు లేదు, ఉండకూడదు. నిరంతరం సృజనాత్మకతతో కూడిన కొత్త ఆవిష్కరణలు చేయడం తప్పనిసరి. దీన్ని పాఠశాల నుంచి బలోపేతం చేయడానికి రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్టీ) కృషి చేస్తూ ఏటా సదస్సులు నిర్వహిస్తోంది.

పాఠశాల స్థాయిలోనే బలోపేతం

వచ్చే తరంలో సృజనాత్మకతకు బీజం వేయాలంటే పాఠశాల స్థాయిలోనే బలోపేతం చేయాలి. తమ తమ పరిధిలోని సమస్యలకు వ్యయం, కాలం, శ్రమ తగ్గించే ఆలోచన చేస్తే చాలు.. అదే సమాజానికి ఉపయోగపడుతుంది. అలాంటి ఆలోచనలు పాఠశాల స్థాయిలో.. అదీ బోధనతోనే ప్రారంభమైతే విద్యార్థుల్లో సృజనాత్మకతకు దోహద చేస్తుందనేది ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగా పాఠశాల స్థాయిలో కొత్త విధానాలతో విద్యార్థులకు సైన్సు బోధన చేయడం, ఉపాధ్యాయుల్లో వృత్తి నైపుణ్యాలను పెంచడం ఎలా అనే దానిపై రాష్ట్రస్థాయిలో సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా సైన్సు బోధించే ఉపాధ్యాయులు, అధ్యాపకుల నుంచి పరిశోధన పత్రాలను ఆహ్వానిస్తోంది.

ఈ ఏడాది అంశం : 'సైన్సు విద్య - రైజింగ్ భారత్'

ఉప అంశాలు : 1. పాఠశాల విద్యలో ప్రయోగాల పెరుగుదల ప్రభావం. 2. సైన్సు బోధనలో సృజనాత్మక ఆవిష్కరణ, 3. బయో డైవర్సిటీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్సు విద్యను ప్రోత్సహించడం, పర్యావరణ అవగాహన.4. పాఠశాలను ఆవిష్కరణల కేంద్రంగా మార్చడం.



నిబంధనలు ఇలా..

పరిశోధనా పత్రాలను ఆంగ్లం, తెలుగు, ఉర్దూలో పంపవచ్చు. సూచించిన అంశాన్ని శీర్షిక, లక్ష్యాలను వెయ్యి పదాలకు(4పేజీలకు) మించకూడదు. పేరు, చిరునామా, తదితర వివరాలతో మెయిల్ కి ఫిబ్రవరి 2వ తేదీలోగా పంపాల్సి ఉంటుంది. లేదా ఎస్సీఈఆర్టీ కార్యాలయం పేరుతో పోస్టు ద్వారా కూడా పంపొచ్చు. పంపిన పత్రాలను పరిశీలించి, ఎంపికైన వారికి జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 24న రాష్ట్ర సదస్సులో పాల్గొనే అవకాశం కల్పిస్తారు.

సిటీ బస్టాండ్‌లో ఆర్‌ఎం కార్యాలయం



ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి 13: నగరంలోని సిటీ బస్టాండ్ ప్రాంగణంలో రీజనల్ మేనేజర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. గతంలో నగరంలోని జూబ్లీక్లబ్ రోడ్‌లో అద్దె భవనంలో కొనసాగు తున్న ఈ కార్యాలయాన్ని గత రెండు రోజుల క్రితం సిటీ బస్టాండ్‌లోని పై అంతుస్తులోకి మార్చారు. అద్దె భవనానికి నెలావారి అద్దెలు అధికంగా ఉండటంతో అధికారులు సిటీ బస్టాండ్ పై అంతస్తును ఆధునికీకరించి ఆర్‌ఎం కార్యాలయంతోపాటు రికార్డుల రూం, డిప్యూటీ ఆర్‌ఎం కార్యాలయాలు ఏర్పాటు చేశారు. 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో 'అద్దె భవనమే ముద్దు.. సొంత భవనం వద్దు' అనే శీర్షికతో ప్రచురితం కావాడంతో స్పందించిన అధికారులు ఏట్టకేలకు సిటీ బస్టాండ్‌లో ఆర్‌ఎం కార్యాలయం ఏర్పాటు చేశారు.

మహిళా సమాఖ్య కార్యాలయంలో చోరీ యత్నం

ఖమ్మం క్రైం, జనవరి 13: నగర పరిధిలోని గౌతమి జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి శనివారం చోరీకి యత్నించాడు. నగర పరిధిలోని టేకులపల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమీపంలో ఉన్న గౌతమి జిల్లా మహిళా సమైక్య కార్యాలయంలో గుర్తు తెలియని వ్యక్తి తలుపులు, కిటికీ అద్దాలు పగలగొట్టి ఉన్న సంఘటనను కార్యాలయ వాచ్‌మెన్ చూసి సంబంధిత అధికారులకు ఈ విషయాన్ని తెలిపాడు. దీంతో వారు ఖమ్మం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నా బిడ్డ ఆచూకీ తెలపండి

- ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదు
- ఓ తల్లి ఆవేదన

మణుగూరు, జనవరి 13: తమ కుమార్తె మేరి నిత్య ప్రకాశిని(14) ఆచూకీ తెలపాలని మణుగూరు మండలంలోని సమితి సింగారం గ్రామానికి చెందిన ఆరుట్ల చైతన్య అనే మహిళ విలేకరుల ఎదుట వాపోయారు. చైతన్య కథనం ప్రకారం.. నిత్య ప్రకాశిని చర్ల మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన బుర్రి ప్రణయ్ అనే ఆటో డ్రైవర్‌తో గత ఏడాది డిసెంబరు నెల 18వ తేదీన వెళ్లింది. ప్రకాశిని తమ ఇంటికి వచ్చిందని ప్రణయ్ తల్లి ఈ విషయాన్ని తల్లికి ఫోన్ చేసి చెప్పారు. ఆమెను వారి గ్రామానికి తీసుకుని వస్తున్నట్లు కూడా చెప్పారు. అయితే ఆప్పటి నుంచి నేటికీ ఆమెను తీసుకురాలేదు. కాగా తమ కుమార్తె గురించి అడిగితే తమకు తమకు తెలియదని సమాధానం చెబుతున్నారని చైతన్య వాపోయారు. ఈ విషయంపై డిసెంబరు 22న మణుగూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిత్య ప్రకాశిని తండ్రి సురేష్‌బాబు మానసికంగా కుంగిపోయి జనవరి 3న మృతిచెందారు. తండ్రి కర్మకార్యక్రమాలకు అయినా కూతురు వస్తుందని చూసినా ఆ తల్లికి నిరాశే ఎదురైంది. పోలీసులను అగిడితే వెతుకుతున్నామని అంటున్నారు.. అసలు తమ కూతురు బతికి ఉందో లేదో ప్రణయ్, అతని తల్లి బేబీల ఏం చేశారో అని చైతన్య కన్నీటి పర్యంతం అవుతున్నారు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, మీడియా ద్వారా అయినా కుమార్తె నిత్య ప్రకాశిని సమాచారం లభిస్తుందని గోడు వినిపించుకుంటున్నానని తెలిపారు. మిస్టరీగా మారిన నిత్య ప్రకాశిని మిస్సింగ్ కేసును పోలీసులు చేధించి తగిన న్యాయం చేయాలని కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చింతకాని, జనవరి 13: మండల పరిధిలోని రైల్వే కాలనీ గ్రామానికి చెందిన షేక్ మీరా సాహేబ్ (39) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడు దినసరి కూలీ కావడంతో నాగులవంచ రైల్వే స్టేషన్‌లో మూడవ రైల్వే లైను నిర్మాణ పనులు కొనసాగతుండటంతో స్టేషన్‌ల ఆవరణలోని షెడ్డును తొలగించే క్రమంలో ఈనెల 10వ తేదీన ప్రమాదవశాత్తు పై నుంచి జారి పడ్డాడు. ఎత్తు నుంచి జారీపడటంతో తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో ఖమ్మంలోని మమత ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆనాటి నుంచి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని తల్లి బీబీ ఫాతీమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఈరు నాయక్



కామేపల్లి, జనవరి 13: టీఎస్ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా బానోత్ ఈరు నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మాలోత్ శివనాయక్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ ఈరు నాయక్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో జీవో నెం. 3ద్వారా బదిలీలు, ప్రమోషన్లకోసం పోరాడతానని అన్నారు.

ముందస్తు సమాచారం ఇస్తే భద్రత: డీఎస్పీ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటరు, జనవరి 13 : సెలవుల్లో టూర్లకు వెళ్లే వారు సమాచారం ఇస్తే ఇళ్లకు పోలీస్ భద్రత కల్పిస్తామని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ శనివారం అన్నారు. సంక్రాంతి సెలవులకు ఊరెళ్తున్న ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. పోలీస్‌శాఖ సూచనలు పాటించి దొంగతనాలు నియంత్రణకు జిల్లా ప్రజలు సహకరించాలని, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



సమావేశమైన పూర్వ విద్యార్థులు

కాలేజీ యాదిలో ఇంటర్ దోస్తులు

- సందడిగా 1987-89బ్యాచ్ ఇంటర్మీడియట్ స్నేహితుల సమ్మేళనం

సత్తుపల్లి, జనవరి 13: సత్తుపల్లిలోని శ్రీ బండి శోభనాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1987-89 ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం జరిగింది. సుమారు మూడన్నర దశాబ్దాల తరువాత కొందరు తమ పాత మిత్రులను కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. మూడు దశాబ్దాల తరువాత కలుసుకున్న మిత్రులు తమ మనసులోని భావాలు పంచుకుంటూ సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా స్నేహితులు ప్రస్తుతం ఎవరే హోదాలో ఉన్నారో తెలుసుకున్నారు. కాలేజీ పూర్తయిన తరువాత వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారు ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకుని హర్షం వ్యక్తంచేశారు. తమ వంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో నాగళ్ల ప్రసాద్, రాజేశ్వరి, ఎండీ సైబుద్దీన్, ఎండీ షాకీర్, ఆర్ శ్రీనివాసరావు, చిల్లగుళ్ల వెంకటేశ్వరరావు, ఎండీ ముక్తార్, బొంతు కృష్ణారావు, కొండా, ఎస్కే మహబూబ్, కృష్ణకిషోర్, ఎండీ ఖాజామియా, ఎండీ రియాజ్, ఎస్కే నజీర్, కృష్ణార్జునరావు, కొండలరావు, నరుకుల్ల శ్రీను, పద్మజ, శైలజ, జరీనా, రామసీత, పద్మజ్యోతిరెడ్డి, స్వరూపారాణి, విజయనిర్మల పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ సీతాలక్ష్మి

కొత్తగూడెం టౌన్, జనవరి 13: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందించేందుకు మహిళలు సమష్టి కృషి జరపాలని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి కోరారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మున్సిపల్ పరిధిలోని గాజులరాజంబస్తీలో మున్సిపల్ కౌన్సిలర్ సహారాబేగం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముగ్గులు వేయడం వల్ల మహిళలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. సంక్రాంతికి ముందు రంగురంగుల ముగ్గులతో సుందరంగా తీర్చిదిద్దిన మహిళలను అభినందించారు. భవిష్యత్ తరాలకు సాంప్రదాయాలను అందించే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ యూసుఫ్, మహిళలు రాజకుమారి, కళ్యాణి, విజయలక్ష్మి, సరోజా, విజయ, రమాదేవి, అనూషా తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిని సందర్శించిన పీవో ప్రతీక్‌జైన్



బోటు షికారు చేస్తున్న ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

పాల్వంచ, జనవరి 13 : ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ శనివారం తన కుటుంబ సభ్యులతో కలసి కిన్నెరసాని జలాశయాన్ని సందర్శించారు. జలాశయం, జింకలపార్కు, ఫారెస్ట్ మ్యూజియం తదితరాలను పరిశీలించారు. అనంతరం జలాశయంలో బోటు షికారు చేశారు.

ఆర్యవైశ్యులు సమాజాభివృద్ధికి తోడ్పడాలి

● ఇల్లెందు ఎమ్మెల్యే కోరం



మాట్లాడుతున్న కనకయ్య

ఇల్లెందు టౌన్, జనవరి 13: ఆర్యవైశ్యులు సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. శనివారం ఇల్లెందు పట్టణంలోని ఆర్యవైశ్య సత్రంలో జరిగిన ఆర్యవైశ్య సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు తమ వ్యాపార అభివృద్ధితోపాటు సమాజ ఉన్నతి కోసం కృషి చేయాలన్నారు. స్వచ్ఛంద కార్యక్రమాల ద్వారా పేదవర్గాలను ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పలు సంక్షేమ కార్యక్రమాలను అన్నివర్గాల వారికి అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఆర్యవైశ్యులు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్యవైశ్యసత్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఇల్లెందు మున్సిపల్‌చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పోలీస్ సీఐ టి. కరుణాకర్, ఆర్యవైశ్య సంఘ ంజిల్లా అధ్యక్షులు చారుగుండ్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పర్లెర్ల చంద్రశేఖర్, నగేష్‌కుమార్, బసవయ్య, వ్యాముసాని రవి, కటకం బాలకృష్ణ, గౌరిశెట్టి నగేష్, పసుమర్తి శ్రీనివాస్, విజయ్‌కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్‌కే. జానీ పాల్గొన్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడి మృతి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటరు, జనవరి 13: పట్టణంలోని కూలీలైన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తమ్మిశెట్టి రామారావు గుండెపోటుతో శనివారం మృతి చెందారు. దీంతో ఆయన మృతదేహాన్ని తెలంగాణ సమరయోధుల సంఘం అధ్యక్షుడు వి. శాంతిరామ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డోర్నాల పాపారావు, గాంధీ పథం జిల్లా కన్వీనర్ చింతలచెర్వు గెర్షోమ్‌లు ఆయన భౌతికాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో దాచేపల్లి వెంకటేశ్వర్లు, అనంతరెడ్డి సూర్యం, సత్తార్, వెంకటేశ్వర్లు, చాంద్‌లు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

▸▸ ఇల్లెందు, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, జారే ఆదినారాయణ ▸▸ గ్రామాల్లో సంక్రాంతి క్రీడలు ప్రారంభం

ఇల్లెందురూరల్/అశ్వారావుపేట రూరల్, జనవరి 13: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని, గ్రామాల మధ్య ఐక్యతను పెంపొదిస్తాయని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సంక్రాంతి సందర్భంగా ఒడ్డుగూడెం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్, కబడ్డీ పోటీలను శనివారం ఎమ్మెల్యే కనకయ్య ప్రారంబించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చాట్ల బాగ్యమ్మ, కాంగ్రెస్ తదితరులు పాల్గొన్నారు. అదేవిదంగా పీవైఎల్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కొమరారం గ్రామంలో జరుగుతన్న సంక్రాంతి క్రీడలను గుండాల పోలీస్ సీఐ రవిందర్, కొమరారం ఎస్ఐ గిరిదర్ రెడ్డిలు ప్రారంబించారు. వారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, క్రీడల ద్వారా భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు.అదేవిదంగా మర్రిగూడెం గ్రామంలో జరుగుఉతన్న క్రీడలను న్యూడెమోక్రసీ కేంద్రకమిటీ నాయకులు ఆవునూరి మధు ప్రారంబించారు.ఈకార్యక్రమంలో తుపాకుల నాగేశ్వరావు, పోడుగు నర్సింహరావు పర్షిక రవి, వాంకుడోత్ మోతిలాల్,సర్పంచులు బానోత్ సంతునాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం

యువత క్రీడల్లో రాణించాలి: ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట రూరల్: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ఎనలేని ప్రతిభ దాగి ఉంటుందని, యువత క్రీడల పట్ల శ్రద్ధ చూపి మరింతగా రాణించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని మామిళ్లవారిగూడెంలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ఐదు రోజుల పాటు జరిగిన క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు వేడుకలను ఎమ్మెల్యే ఆదినారాయణ కుటుంబసమేతంగా హాజరయ్యారు. పోటీల ముగింపు అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ యువత చదువు, క్రీడలతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడల ద్వారా శరీర ధారుడ్యం పెరగటంతో పాటు స్నేహబావాలు పెంపొందుతాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచి మొడియం నాగమణి, నాయకులు సూర్యచంద్రం, ప్రమోద్, శింగలదేవి కనకం, రామినేని సత్యనారాయణ, మోహనరావు, నంద్రు రమేశ్, నిర్వాహకులు బాబి, గీతా, శివ, ఉమ, నరేశ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

చండ్రుగొండ: గ్రామాల్లో పశువైద్యం అందజేస్తున్న గోపాలమిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు ఆ సంఘం జిల్లా కమిటి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. శనివారం సంఘం జిల్లా ప్రదానకార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కమిటి సభ్యులు ఆశ్వారావుపేటలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. గత 23 సంవత్సరాల నుండి గోపాలమిత్రలుగా పని చేస్తున్నామని, అయినా ప్రభుత్వం గోపాలమిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదని వివరించారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెల్లాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వెంకటేశ్వర్లు, వై.రాము, నరేష్, వెంకటేశ్వరరావు ఉన్నారు.

క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీయాలి..

పాల్వంచ రూరల్: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయాలని రేగులగూడెం గ్రామ పెద్ద వజ్జా బాబు పేర్కొన్నారు. రేగులగూడెం ఉమ్మడి పంచాయతీలో వజ్జా బాబు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పంచాయతీ స్థాయి వాలీబాల్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీ స్థాయి క్రీడల్లో యువకులు ఆడితేనే వారి ప్రతిభ బయట పడుతుందని అన్నారు. ఈ క్రీడల్లో రాణిస్తే జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందని అన్నారు. క్రీడలు శారీరక ధారుడ్యం పెరుగుదలతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ప్రథమ బహుమతి రూ. 5,116 మైలారం గ్రామం గెలుపొందింది. ద్వితీయ బహుమతి రూ. 3,116 ప్రైజ్‌మనీ లక్ష్మీదేవిపల్లి టీ మ్ గెలుపొందింది. కార్యక్రమంలో ఈసం రాంబాబు, కాలం శ్రీను, రమేష్, వెంకన్న, కళ్యాణ్ తదితరులు ఉన్నారు.



బహుమతి ప్రదానోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారే

బూర్గంపాడు: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని బూర్గంపాడు ఎస్ఐ రాజ్‌కుమార్ అన్నారు. శనివారం అంజనాపురం గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంటును ఎస్ఐ ప్రారంభించారు. అనంతరం స్థానిక యువతకు రెండు క్రికెట్ బ్యాట్‌లను అందజేసి మాట్లాడారు. క్రీడలు యు వతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు దోహద పడతాయన్నారు. క్రీడల వల్ల యువతలో శారీరక ధారుడ్యం పెరుగుతుందని అన్నారు. క్రీడలకు అధిక ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచు భూక్యా అనంద్‌రావు, పీఆర్‌టీయూ నాయకులు రామారావు, వార్డు సభ్యులు భాస్కర్, చంటి, లింగ, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడల ప్రారంభం

కరకగూడెం: యువతకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని.. నిరుద్యోగ యువత క్రీడలపై ఆసక్తి కనబర్చాలని కరకగూడెం ఏఎస్ఐ పాపయ్య అన్నారు. శనివారం మండలంలోని తాటిగూడెం పంచాయితీలోని క్రీడా మైదానంలో సంక్రాంతి పండుగ సందర్భంగా రెండు జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమరం విశ్వనాధం, కమిటీ సభ్యులు కొమరం కాంతారావు, గొగ్గలి కృష్ణ, పోలెబోయిన వెంకటనారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆదివాసీల జోలికి వస్తే సహించేది లేదు

▸▸ అఖిలపక్ష సమావేశంలో నేతల తీర్మానం

చుంచుపల్లి, జనవరి 13: ఆదివాసీల జోలికొస్తే సహించేది లేదని వారి కోసం ఎంత పోరాటాలైన సిద్ధమని అఖిలపక్ష నేతలు హెచ్చరించారు. శనివారం చుంచుపల్లి మండలంలోని ప్రగతినగర్ పంచాయతీ ఆదివాసీనగర్‌లో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఇమంది ఉదయ్‌కుమార్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేవం నిర్వహించారు. ప్రశాంత్‌నగర్ పంచాయతీలో ప్రభుత్వ భూమిలో ఆరేళ్ల నుంచి గడిసెలు వేసుకుని నివసిస్తున్న వారిని ఇప్పటికే రెండుసార్లు ప్రభుత్వ అధికారులు గుడిసెలను తొలగించారని తెలిపారు. నిర్బంధాలను విధించి పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేసి నానా ఇబ్బందులకు గురి చేశారన్నారు. పల్లెప్రకృతి వనానికి కేటాయించిన భూమిలో అక్రమంగా గుడిసెలు వేసుకుని చేశారని ఫిర్యాదు చేయడంతో గుడిసెలను తొలగించాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.

దాదాపు 40 ఏళ్ల క్రితం ఐటీడీఏ గరిమెళ్లపాడు నర్సరీలో ఉద్యోగాలు ఇస్తామంటే నమ్మి దాదాపు 100 ఎకరాల భూమిని ఐటీడీఏకు అప్పగిస్తే వారికి ఉపాధి లేకుండ భూమిని లాక్కున్న ఐటీడీఏ చర్యలతో నేతలు తప్పుపట్టారు. ఇందిరమ్మ కాలంలో ఇచ్చిన ఇళ్లలోనే గిరిజనులు నివాసం ఉంటూ జీవితాన్ని కొనసాగిస్తున్నారన్నారు. వారికి మొక్కలను పెంచడం తప్ప వేరే తెలియదని నాయకులు అన్నారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో మండల జిల్లా అధికారులను, మంత్రులను కలుస్తామని వినతిపత్రాలను ఇచ్చి ఆదివాసీ గిరిజనుల బాధలను తెలియచేస్తామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు తోట దేవీ ప్రసన్న, బీజేపీ రాయుడు నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు లిక్కి బాలరాజు, బీఆర్ఎస్ నాయకులు డాబా నాగేశ్వరరావు, ఆదివాసీ జేఏసీ అధ్యక్షులు వాసం రామకృష్ణ, దొర, లక్ష్మీదేవిపల్లి జడ్పీటీసీ మేరెడ్డి వసంత అక్క, లక్ష్మీదేవిపల్లి ఎంపీటీసీ ముక్కెర శిరీష, కాంగ్రెస్ నాయకులు గోదాసు కనకరాజు నగేష్, గ్రామ పెద్ద వెంకటేశ్వర్లు,సమ్మక్క, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



గరిమెళ్లపాడులో ఐక్యత చాటుతున్న నాయకులు

రద్దయిన రైళ్లను పునరుద్ధరించాలి

▸▸ మెయిల్‌లో రైల్వే జీఎంకు వినతి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటరు, జనవరి 13: కొత్తగూడెం రైల్వేస్టేషన్ (భద్రాచలం రోడ్డు) నుంచి గతంలో నడిపించిన ప్యాసింజర్ రైలును తిరిగి పునరుద్ధరించాలని కొత్తగూడెం వ్యాపారులు రైల్వే జీఎంను కోరారు. ఈ మేరకు శనివారం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో రైల్వే జీఎంకు పోస్టు చేస్తున్న వినతిపత్రాన్ని చూపారు. రైల్వేస్టేషన్ నుంచి రద్దైన రైళ్ల రాకపోలను పునరుద్ధరించడంతోపాటు అయోధ్య, తిరుపతి, షిర్డికి ప్రత్యేక రైళ్లను నడపాలని డిమాండ్ చేశారు. ఎక్కువ మంది ప్రయాణించేందుకు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రస్తుతం కేటాయిస్తున్న 19 రైలు బోగీల స్థానంలో 24కి పెంచాలన్నారు.

ఈమేరకు సౌత్ సెంట్రోల్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు ఈ మెయిల్‌పోస్టులో వినతిపత్రం పోస్టుకార్డుల పోస్టు చేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం వ్యాపారుల సంక్షేమ సంఘం కన్వీనర్ మొరిశెట్టి భవాని ప్రసాద్, కో కన్వీనర్ పల్లపోతు శ్రీనివాస్, ట్రెజరర్ హంసరాజా జకోటియా, సభ్యులు అబిద్, అనూప్, కూర శ్రీధర్, మనీష్‌కుమార్ అగర్వాల్, ప్రేమ్‌కుమార్, అనీష్‌కుమార్, సాయి, విజయ్‌కుమార్, మధుసూధన్‌రావు, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రైల్వే జీఎంకు పోస్టు చేస్తున్న వినతిపత్రాన్ని చూపుతున్న వ్యాపారులు

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడికి సన్మానం



సన్మాన కార్యక్రమం

అశ్వారావుపేట రూరల్, జనవరి 13: మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్.శ్రీనివాసరావును శనివారం వినాయకపురంలో ఘనంగా సత్కరించారు. స్థానికంగా గల ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామపెద్దలు, సంఘాల నాయకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు బీర్రం వెంకటేశ్వరరావు, ఉప్పల మురళీ, పొట్టా రాజులు, లోకం సాంబశివరావు, మారుతి లక్ష్మణరావు, ఉప్పల ప్రసాద్, వీర్నాల హరిప్రసాద్, వీరబాబు, మారుతి వసంతరావు, తమ్మిశెట్టి శ్రీను, రాజశేఖర్, సత్తియ్య, కక్కిరాల నాగరాజు, సాయి, చిన్ని పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

అశ్వారావుపేట, జనవరి 13: పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో శనివారం వాసవిక్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలవురు మహిళలు ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ప్రధమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులను క్లబ్ అధ్యక్షులు జల్లిపల్లి దేవరాజ్ అందజేశారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ డిస్ట్రిక్ జాయింట్ ట్రెజరర్ శీమకుర్తి సుబ్బారావు, ట్రెజరర్ సత్యవరపు బాల గంగాధర్, ఆలయ కమిటీ అధ్యక్షులు ముత్తా సుమాకర్, పట్టణ ఆర్యవైశ్యసంఘ అధ్యక్షులు జల్లిపల్లి లోక్‌నాధ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

'న్యూ సెంచరీ'లో సంక్రాంతి సంబురాలు



సంబురాలు నిర్వహిస్తున్న దృశ్యం

బూర్గంపాడు, జనవరి 13: బూర్గంపాడులోని న్యూ సెంచరీ హైస్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబురాలు అంబురాన్ని అంటాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలుగువారి సంప్రదాయ వస్త్రాలు ధరించారు. పాఠశాల ప్రదానోపాధ్యాయులు లైక్ అశిక్ భోగిమంటలు వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్నారుల వేషధారణలు పలువురుని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వాముల ఇరుముడి

టేకులపల్లి, జనవరి 13: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలోని శీ సీతారామాంజనేయ ఆలయంలో శనివారం అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భాస్కర్ గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. 41రోజులపాటు చేసిన మాలదారులు గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకొని శబరిమలై జ్యోతి దర్శనానికి బయలు దేరి వెళ్లారు. ఇరుముడి ధరించిన వారిలో బుర్ర శంకర్ గురుస్వామి, గుర్రం ఆదర్శ్ భార్గవ్ కత్తి స్వామి, వల్లాల రవిస్వామి, బోనాసు రాజు స్వామి తదితరులు ఉన్నారు.



ప్రజా భవన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం

మణుగూరు, జనవరి 13: మణుగూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజా భవన్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం లాంచనంగా ప్రారంభించారు. సీపీఐ రాష్ట్ర నాయకులు బి.అయోధ్య, డీసీసీబీ డైరక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ నాయ కులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి తరలి వచ్చారు. వేద పండితుల శేషగిరి శర్మ బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల్ని నిర్వహించగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటే శ్వర్లు, ప్రమీల దంపతులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రారం భోత్సవం అనంతరం ఎమ్మెల్యే పాయంకు నాయకులు తుళ్లూరి బ్రహ్మ య్య, అయోధ్య తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా భవన్ సేవలందిస్తుందన్నారు.ప్రజలు నేరుగా తమ సమస్యలను తనకు చెప్పుకోవాలని మధ్యవర్తులు అవసరం లేదని తెలిపారు. ఎల్లవేళలా తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



పూజలో పాల్గొన్న పాయం దంపతులు

ఇంటింటికీ అయోధ్య అక్షింతల పంపిణీ

● పాల్వంచలో అక్షింతలు స్వీకరించిన ముస్లిం మహిళ

పాల్వంచ టౌన్, జనవరి 13: అయోధ్య శ్రీరాముని సన్నిధానంలో శ్రీ రాముడ్ని పూజించిన అక్షింతలను శనివారం భక్తి శ్రద్దలతో శ్రీరామ్ నినాదాన్ని పఠిస్తూ ఇంటింటికి పంపిణీ చేశారు. దానిలో భాగంగా బాపూజీనగర్‌లో వీహెచ్‌పీ భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అక్షింతలను ప్రతి కుటుంబానికి అందచేశారు.

మత సామరస్యానికి ప్రతీకగా..

మత సామరస్యానికి ప్రతీకగా పాల్వంచ బాపూజీనగర్‌కు చెందిన ఓ ముస్లీం మహిళ తాను సైతం భక్తిభావంతో అయోధ్య రామయ్య అక్షింతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్ బాధ్యులు గడిదేశి వెంకటేశ్వర్లు, మేదరమెట్ల పార్థసారధి, సంక్రాంతి రవి, జైన్‌కుమార్, మహిళ భక్తులు అక్కినేని సూర్యావతి, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

● టేకులపల్లి: అయోధ్య రామమందిరం ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురష్కరించుకొని అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను శనివారం మండలంలోని బొమ్మనపల్లిలో ప్రతి ఇంటికి పంపిణీ చేశారు. గ్రామంలోని శీసీతారాంజనేయ ఆలయం నుంచి ఊరేగింపుగా శ్రీసీతారాములు ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపుగా ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు. బొమ్మనపల్లి శీసీతారామాంజనేయ ఆలయ అర్చకులు రామాచార్యులు అక్షింతలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు మిరియాల వెంకటేశ్వర్లు, దోర్నాల మోహన్‌రావు, బుర్ర ధర్మయ్యగౌడ్, నల్లమాసు శంకర్ గౌడ్, బుర్రమోహన్‌రావు గౌడ్, మల్లేశం గౌడ్, నర్సయ్య గౌడ్, నారందాసు నర్సింహారావు, మొగలగాని శ్రీనివాస్, శివనాధుల విశ్వప్రసాద్, లక్ష్మణ్, బండి శంకర్, బొమ్మెర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పాల్వంచలో ముస్లి మహిళ అక్షింతలు స్వీకరిస్తున్న దృశ్యం

● ఆళ్లపల్లి: అయోధ్య శ్రీరామ మందిరం ప్రతిష్ఠ సందర్భంగా ఇంటింటికి అయోధ్య రాములవారి అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం మండల పరిధిలోని మర్కోడు గ్రామంలో నిర్వహించారు. గ్రామంలోని రామాలయంలో పూజలు నిర్వహించి, యువత, మహిళలు, పెద్దలు అందరు కలిసి అక్షింతలను గ్రామంలో ఇంటింటికి అందజేశారు. 22న చేయాల్సిన కార్యక్రమాలు తెలియజేశారు.

ప్రజాసేవతో పార్టీ విస్తరణకు కృషి చేయాలి

● సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం

పాల్వంచ టౌన్, జనవరి 13: ప్రజా సమస్యల పట్ల స్పందిస్తూ ప్రజాసేవతో పార్టీ విస్తరణకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం కోరారు. శనివారం పార్టీ సభ్యత్వ నమోదుపై పార్టీ కార్యాలయం సీఆర్‌భవన్‌లో పట్టణ, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. పార్టీలో నూతన సభ్యుల సభ్యత్వ నమోదును ముమ్మరంగా చేపట్టాలని, కమ్యూనిస్టుల అవసరాన్ని ప్రజలు గుర్తించారని తెలిపారు. ఎమ్మెల్యే కూనంనేని నాయకత్వంలో ప్రతి సమస్యను పరిష్కరించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమిల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, రాహుల్, నాగరాజు, సుధాకర్, వి. పద్మజ, వి. విశ్వేశ్వరరావు, ఎ. వెంకటేశ్వర్లు, ఎస్. నాగేశ్వరరావు, కే. రామారావు, సంఘమిత్ర, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ కోసం బీజేపీ కట్టుబడి ఉండాలి

● ఎమ్మెస్పీ జిల్లా కన్వీనర్ వంగూరి

పాల్వంచ రూరల్, జనవరి 13: ఎస్సీ వర్గీకరణ కోసం బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉండాలని మహజన సోషలిస్ట్ పార్టీ(ఎమ్మెస్పీ) జిల్లా కన్వీనర్ వంగూరి ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని సంజీవనగర్ గ్రామంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం బీజేపీ ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో విడుదల చేయాలని అన్నారు. మాదిగలు మాదిగ ఉప కులాల కోసం ఎస్సీ దశాబ్దాలుగా ఉద్యమాలు చేసినా ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. దేశంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణ కోసం సహకరించి బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం కూడా ఎస్సీ వర్గీకరణ కోసం చిత్తశుద్ధితో పని చేసి జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దాసరి ముత్తయ్య, ఉబ్బపల్లి కృష్ణ, తడికమల్ల శివ, కిరణ్, హుస్సేన్, నవీన్, రవి తదితరులు ఉన్నారు.

నకిలీ నాయకులపై చర్యలు తీసుకోవాలి

● డిప్యూటి సీఎంకు ఫిర్యాదులో కోరిన టీపీసీసీ సభ్యుడు శౌరీ



భట్టికి వినతిపత్రం అందజేస్తున్న శౌరి

చుంచుపల్లి, జనవరి 13: జిల్లా కాంగ్రెస్ పార్టీలో ప్రక్షాళన చేసేలా చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం, మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు టీపీసీసీ సభ్యుడు, రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ జేబీ. శౌరీ ఫిర్యాదు చేశారు. శనివారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. జిల్లాలో పార్టీలో జరుగుతున్న పరిణామాలను వివరించారు. జిల్లాలో కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని, కొంతమంది అవినీతి అధికారులు, నకిలీ కాంగ్రెస్ పార్టీ నాయకులతో రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో ఇటీవల కాలంలో కొంత మంది బీఆర్ఎస్ పార్టీకి ఏజెంట్లుగా వ్యవహరించిన వాళ్ల లిక్కర్ సిండికేట్స్, భూదందాలు చేస్తున్న వాళ్లకు కాంగ్రెస్ పార్టీ పేరుతో నకిలీ పదవులు సృష్టించుకున్నారని మండిపడ్డారు. ఆ నాయకులు ప్రభుత్వ అధికారులు, వివిధ రంగాల వారితో కుమ్మక్కై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అసలైన నిబద్ధత కలిగిన నాయకులకు, ప్రజాప్రతినిధులకు, ప్రజా ఉద్యమాల్లో ప్రజల పక్షాన పోరాడిన ఉద్యమకారులను గుర్తించడం లేదన్నారు.పరిశ్రమలను అభివృద్ధి పర్చే దిశగా తీసుకుని వెళ్లాలని కోరారు.

రాజేష్ కుటుంబానికి అండగా ఉంటాం

పినపాక, జనవరి 13: ఇటీవల మృతి చెందిన మండలంలోని గడ్డంపల్లి గ్రామానికి చెందిన యువకుడు సోలం రాజేష్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరపున, వ్యక్తిగతంగా అండగా ఉండి, ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి, మంత్రి ధనసరి సీతక్క కుమారుడు ధనసరి సూర్య తెలిపారు. శనివారం మృతుడు రాజేష్ దశదిన కర్మల కార్యక్రమానికి వచ్చిన ఆయన రాజేష్ చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పొనుగోటి చంద్రరావు, చందా వరప్రసాద్, జర్పుల రాము, గొంది రాధ, అచ్చా నవీన్, అంబేద్కర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు లింగారెడ్డి, గుండు నర్సింహమూర్తి, కల్తి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

2న దమ్మపేట సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాసం

దమ్మపేట, జనవరి 13: దమ్మపేట విశాలపరపతి సహకార సంఘం చైర్మన్‌పై సభ్యులు ఎల్లిన రాఘవరావు ఆధ్వర్యంలో 11 మంది డైరెక్టర్లు జిల్లా సహకార సంఘం అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేసారు. ఈమేరకు ఫిబ్రవరి 2 దమ్మపేట సొసైటి చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానంపై సొసైటీ అధికారులు శనివారం సభ్యులకు నోటీసులు అందించినట్లు తెలిసింది. ఈ విషయం పై సొసైటీ కార్యదర్శి ఆకుల నాగేశ్వరరావును వివరణ కోరగా అవిశ్వాస తీర్మానం పెట్టి నట్లు తెలిపారు. ఈ మేరకు సొసైటీ సభ్యులకు నోటీసులు అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఆదివాసీలకు రగ్గుల పంపిణీ

ములకలపల్లి, జనవరి 13: ములకలపల్లి మండలం తాళ్లపాయి గ్రామ పంచాయతీ పరిధిలోని వలస ఆదివాసీగుడేలైన కొమరం భీంనగర్, ఊటచెరువు గిరిజనులకు పీపుల్ హెల్పింగ్ చిల్డ్రన్ సంస్థ సహకారంతో శనివారం ములకలపల్లికి చెందిన కారేపల్లి ఎస్ఐ పుష్పాల రామారావు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి తీవ్రత దృష్ట్యా ఆదివాసీలకు రగ్గులు అందచేస్తున్నామని తెలిపారు. ఇందుకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేష్, పుష్పాల కుటుంబ సభ్యులు పుష్పాల చందర్‌రావు, హనుమంతరావు, సాయి పాల్గొన్నారు.